



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | బుధవారం 9-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:32 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# నటుడు జయప్రకాశ్ రెడ్డి కన్నుమూత

## గుండెపోటుతో ఇంట్లోనే హఠాన్మరణం



గుంటూరు,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): చిత్రసీమలో మరో విషాదం నెలకొంది. టాలీవుడ్ ప్రముఖ నటుడు జయప్రకాశ్‌రెడ్డి(74) కన్నుమూశారు. గుండెపోటుతో బాత్‌రూమ్‌లో కుప్పకూలిన ఆయన అక్కడే తుదిశ్వాస విడిచారు. కాగా 1946 మే 8న జన్మించిన జయప్రకాశ్‌రెడ్డి.. రంగస్థల నటుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 'బ్రహ్మపుత్రుడు' చిత్రంతో సినీ రంగంలో అడుగుపెట్టి... రాయలసీమ మాండలీకంతో విలనిజం పండిస్తూ అనతికాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నారు. ప్రేమించుకుందాం రా, సమరసింహారెడ్డి, జయం మనదేరా, చెన్నకేశవరెడ్డి, సీతయ్య, ఛత్రపతి, గబ్బర్‌సింగ్, నాయక్, రేసుగుర్రం, మనం, టెంపర్, సరైనోడు తదితర సినిమాల్లో నటించారు. సీనియర్ కథానాయకులతో పాటు యువ హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకుని తనదైన నటనతో ప్రేక్షకులకు వినోదం పంచారు. విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అలరించి లక్షలాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఇక విప్లవ చిత్రాల దర్శకుడు ధవళ సత్యం దర్శకత్వంలో జయప్రకాశ్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తూ 'అలెగ్జాండర్'(ఒక్కడే నటుడు.. అతడే నట సైన్యం అనేది ట్యాగ్‌లైన్) పేరుతో ఇటీవల ఓ సినిమాను కూడా నిర్మించారు. జయప్రకాశ్‌రెడ్డి మరణం పట్ల సినిమా ప్రముఖులు సంతాపం తెలిపారు. సినిమా పరిశ్రమ మంచి నటుడిని కోల్పోయిందని నివాళులు అర్పిస్తున్నారు.

# జయప్రకాశ్ మృతికి సీఎం కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ప్రముఖ సినీ నటుడు జయప్రకాశ్ రెడ్డి(74) మరణం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనేక సినిమాల్లో విభిన్న పాత్రల్లో నటించిన మంచి నటుడిగానే కాకుండా, గొప్ప రంగస్థల నటుడిగా కూడా జయప్రకాశ్ రెడ్డికి ప్రజల్లో అభిమానం ఉందని సీఎం అన్నారు. మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో బాత్‌రూమ్‌లోనే కుప్పకూలిన జయప్రకాశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో సినిమా షూటింగ్‌లు లేకపోవడంతో ప్రస్తుతం ఆయన గుంటూరులో నివాసం ఉంటున్నారు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

# జయప్రకాశ్ మృతికి సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి

## చిరు, మోహన్‌బాబు, బాలయ్య, వెంకీ సంతాపం

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): సీనియర్ నటుడు జయప్రకాశ్ రెడ్డి మృతికి సినీ,రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన నటనా వైదుష్యాన్ని గుర్తు చేసుకున్నారు. జయప్రకాశ్ ఆకస్మిక మరణం తీరని లోటని అన్నారు. జయప్రకాశ్ మృతికి మెగాస్టార్ చిరంజీవి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి సినీ ఇండస్ట్రీకి తీరని లోటన్నారు. చివరిగా ఆయనతో ఖైదీ నెంబర్ 150 చిత్రంలో కలిసి నటించాను. ఆయన గొప్ప నటుడు. నాటక రంగం నన్ను కన్న తల్లి, సినిమా రంగం నన్ను పెంచిన తల్లి అనేవారు. అందుకే ఇప్పటికి శని, ఆదివారాలలో షూటింగ్‌లు పెట్టుకోనండి, స్టేజ్‌పై పర్‌ఫార్మెన్స్ ఇస్తుంటాను. మీరు ఎప్పుడైన రావాలి అని అడిగేవారు. ఆ అవకాశాన్ని నేను పొందలేకపోయానని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. సినిమాలలో రాయలసీమ ఫ్యాక్షనిస్ట్ అంటే మొదటు గుర్తుకు వచ్చేది జయప్రకాశ్ రెడ్డి గారే. తనకంటూ ప్రత్యేక ట్రెండ్ సెట్ చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని చిరు ట్వీట్ చేశారు. రాజేంద్రప్రసాద్, రాజమౌళి, సునీల్,రాధిక శరత్ కుమార్ తదితరులు కూడా జయప్రకాశ్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ సీనియర్ నటుడు జయప్రకాశ్ రెడ్డి(74) మంగళ వారం ఉదయం గుండెపోటుతో గుంటూరులో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై పలు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా హీరోలు బాలకృష్ణ, వెంకటేష్, మోహన్ బాబు ..జయప్రకాశ్ మృతి తమని ఎంతో కలచివేసిందని ట్వీట్ చేశారు. ఎన్నో మంచి పాత్రలతో మెప్పించిన విలక్షణ నటుడు జయప్రకాష్ రెడ్డిమృతి విచారకరం, పరిశ్రమకు తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్ధిస్తున్నానని నందమూరి బాలకృష్ణ అన్నారు. జయప్రకాష్ రెడ్డి మరణవార్త నన్ను ఎంతగానో బాధించిందని నటుడు మోహన్ బాబు అన్నారు. మా లక్ష్మీ పిక్చర్స్ బ్యానర్ లో ఎన్నో మంచి పాత్రలు చేశారు. నటుడిగా జయప్రకాష్ రెడ్డి బిజీగా ఉన్నప్పటికీ తనకు ఎంతో ఇష్టమైన నాటక రంగాన్ని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ నాటకాల్లో పాత్రలు పోషిస్తూ ఉండేవారు. పదిమందికి సహాయం చెయ్యాలనే వ్యక్తి తను. జయప్రకాష్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని శిరిడి సాయినాధున్ని కోరుకుంటున్నాను. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు. నా ప్రియమైన స్నేహితుడు జయప్రకాశ్ రెడ్డి గారి ఆకస్మిక మరణం గురించి విన్నప్పుడు చాలా బాధ పడ్డాను. మాది తెరపై అద్భుతమైన కాంబినేషన్. ఖచ్చితంగా అతనిని మిస్ అవుతాం. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్ధిస్తున్నాను. కుటుంబంకి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అంటూ వెంకీ ట్వీట్ చేశారు. జయప్రకాశ్ రెడ్డితో కలిసి పనిచేసిన దర్శకులు, నిర్మాతలు, నటులు ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మంచు విష్ణు, రామ్ తదితరులు జయప్రకాశ్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.

# రైలుఢీకొని మహిళ మృతి

## అంబులెన్స్ ఆలస్యంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం

రాంచి,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ లాతేహర్ జిల్లాలో రైలు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలై మృతి చెందింది. ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంబులెన్స్ పంపకపోవడంతోనే ఆమె మృతి చెందిందని కుటుంబ

సభ్యులు ఆందోళనకు దిగారు. టోలా జంక్షన్ రైల్వే స్టేషన్ సమీపంలో లాడియా గ్రామానికి చెందిన రుక్మిణీ దేవి అనే మహిళను రైలు ఢీకొట్టింది. రైల్వే అధికారులు సమీపంలోని చాంద్వా ఆరోగ్య కేంద్రం అంబులెన్స్ పంపాలని ఫోన్ చేశారు. సిబ్బంది అందుబాటులో లేదని చెప్పడంతో బాధితురాలి కుమారులు ఆమెను రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్న స్ట్రెచర్‌పై ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. అంబులెన్స్ హాస్పటల్ వెలుపలే ఉండటంతో కుటుంబ సభ్యులు సిబ్బందిని నిలదీశారు. అంబులెన్స్ పంపి ఉంటే తమ తల్లి బతికి ఉండేదని, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని కుమారులు, బంధువులు దవాఖాన ఎదుట ఆందోళకు దిగారు. అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో పంపలేకపోయామని ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి నంద్ కుమార్ పోలీసులకు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారతదేశ ఆధునిక నిర్మాత పివి

## ఆర్థిక సంస్కరణలతో ప్రగతి పట్టాలకెక్కించారు
## నూతన ఆర్థిక సంస్కరణల సృష్టికర్త పీవీ
## పండిట్ నెహ్రూ తరువాత అంతటి మహానేత
## దేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ఘనుడు
## మరణానంతర భారతరత్న పివికి ఇవ్వాలి
## పార్లమెంటులో పివి విగ్రహం ఏర్పాటు చేయాలి
## పివి గ్లోబల్ లీడర్ అంటూ కితాబు
## -అసెంబ్లీలో తీర్మనం ప్రతిపాదించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. భారత దేశాన్ని అగ్రదేశాల సరసన నిలబెట్టిన గ్లోబల్ లీడర్ పివి అని, శతజయంతి ఉత్సవాలు జరుపు కుంటున్న ఈ వేళ మరణనానంతరం పివికి భారతరత్న ఇవ్వాంటూ కెసిఆర్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ పివి సమున్నత నేతగానే కాక బహుముఖ ప్రజ్ఞశాలి అని కొనియాడారు. మంగళవారం రెండో రోజు వర్షాకాల శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే పివి గురించి మాట్లాడుతూ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన పీవీ శతజయంతి ఉత్సవాలపై సభలో చర్చించారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. నూతన ఆర్థిక సంస్కరణల సృష్టికర్త పీవీ అని కొనియాడారు. దేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టడమే గాకుండా భారత ఖ్యాతిని దిగంతాలకు వ్యాప్తి చేయించారని అన్నారు. అనేక రంగాల్లో భారత్‌ను ప్రపంచ దేశాలతో పోటీ పడేలా చేశారని అన్నారు. ఆర్థికరంగంలో ఆయన సంస్కరణల కారణంగా నేడు భారత దేశం తలెత్తుకునేలా చేశారని అన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ మన ఠీవి అని ఆయనకు లభించాల్సిన గౌరవం దక్కలేదన్నారు. ఏడాది పాటు పీవీ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. గ్లోబల్ ఇండియా నిర్మాత పీవీ నరసింహారావు అని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో పీవీ ప్రధాని అయ్యారని తెలిపారు. పీవీ అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రణబ్ ముఖర్జీని ఆర్థికమంత్రి చేసిన ఘనత పీవీది అని పేర్కొన్నారు. పీవీ నాటిన సంస్కరణ ఫలితాలను ఇప్పుడు అనుభవిస్తున్నామని సీఎం తెలిపారు. భూ సంస్కరణలకు పీవీనే నాంది పలికారని గుర్తుచేశారు. తన సొంత భూమి 800 ఎకరాలను ప్రభుత్వానికి స్వాధీనం చేశారని కొనియాడారు.



హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. అలాగే పార్లమెంట్ ఆవరణలో ఆయన విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయన చిత్రపటాన్ని అసెంబ్లీలో ఆవిష్కరించాలని స్పీకర్ పోచారంను కోరారు. సువిశాలమైన భారతదేశంలో 135 కోట్ల జనాభా ఉన్నది. ప్రజాస్వామిక వ్యవస్థ ఉన్నది. ప్రధానిగా సేవలందించే అవకాశం కొద్ది మందికే ఉంటుంది. ఈ పదవి చాలా అరుదుగా దక్కుతుంది. అలాంటి పదవి తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు దక్కింది. పీవీ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా.. కేంద్ర ప్రభుత్వాన్ని భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానం ప్రవేశపెడుతున్నాం. పీవీ బహుముఖ ప్రజ్ఞశాలి, బహుభాషా కోవిదుడు. నూతన ఆర్థిక సంస్కరణలు చేపట్టిన ఘనుడని కొనియాడారు. భారత పూర్వ ప్రధాని పీవీ శత జయంతి చరిత్రలో విశిష్ట సందర్భంగా ఉండాలి. ఆత్మగౌరవ పతాక అయిన పీవీ శత జయంతి ఉత్సవాలను సంవత్సరం పాటు నిర్వహించే ందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దేశానికి చేసిన సేవలను ప్రజలందరూ స్మరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తున్నది. భారత్ వేగంగా అభివృద్ధి చెందడానికి, ఆర్థిక వ్యవస్థలో పురోగమించడానికి పీవీ కారణం. పీవీ మన ఠీవీ అని తెలంగాణ సగర్వంగా చెప్పుకుంటున్న సందర్భం ఇది. పీవీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో దేశం సమస్యల నుడిగుండంలో సతమతవుతోంది. దేశ ఆర్థికరథాన్ని పీవీ ప్రగతి రథంలో పరుగులు పెట్టించారు. ప్రధాని పదవికి చేపట్టిన మొట్టమొదటి దక్షిణాది వ్యక్తి. నూతన ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. వాటిని సమర్థవంతంగా అమలు చేశారు. రాజకీయాలతో సంబంధంలోని ఆర్థికవేత్త మన్మోహన్‌ను ఆర్థిక శాఖ మంత్రిగా నియమించి పీవీ తన ప్రత్యేకతను చాటుకున్నారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గమనాన్ని మార్చివేశారు. అభివృద్ధిరేటు సున్నా అవుతున్న విపత్కర పరిస్థితి నుంచి దేశ ఆర్థిక పరిస్థితిని పట్టాలెక్కించి పరుగులు తీయించారు. ప్రపంచం నలుమూలల నుంచి దేశానికి పెట్టుబడులు వస్తున్నాయంటే దానికి కారణంగా పీవీనే. నగటు భారతీయుని జీవన శైలి మారడంలో కూడా పీవీ దార్శనికత ఉంది. గ్లోబల్ ఇండియా రూపశిల్పి పీవీ. పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నాం. ఆధునిక భారతదేశాన్ని నిర్మించిన తొలి వ్యక్తి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అయితే..రెండో వ్యక్తి పీవీ అని శ్లాఘించారు. దార్శనికతతో ధైర్యంగా ముందడుగు వేసిన ఘతన పీవీదే. దాదాపు మూడు దశాబ్దాలు చైనా సరిహద్దు ప్రశాంతంగా ఉండడానికి పీవీనే కారణం. భూసంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చేశారు. రాష్ట్ర విద్యామంత్రిగా గురుకుల పాఠశాలలు ప్రారంభించారు. కేంద్రంలో మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలు ప్రారంభించారు. ఈ విద్యాలయాల్లో చదివిన వారు ఎందరో ఉన్నత పదవుల్లో ఉన్నారు. తెలుగు అకాడమిని నెలకొల్పిన ఘనత కూడా పీవీకే దక్కుతుందన్నారు. పీవీది సమున్నత వ్యక్తిత్వం. మహోన్నత తాత్వికవేత్త. అఖండమైన పాండిత్యం ఉన్న వ్యక్తి. రాజకీయాల్లో మునిగితేలుతూనే వేయి పడగలు అనే నవలను హిందీ భాషలోకి అనువాదం చేశారు. ఈ నవల ఇతిహాసం వలే ఉంటుంది. ఈ నవలతో పీవీ పాండిత్యం ఏమిటో అర్థమవుతుంది. పీవీ దేశానికి, రాష్ట్రానికి ఎన్నో సేవలందించాలరు. అలాంటి మహోన్నత వ్యక్తికి భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానంపై సుదీర్ఘంగా చర్చించిన సభ్యులు పివికి భారతరత్న ఇవ్వాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

# తెలంగాణలో కొత్తగా 2,392 కరోనా పాజిటివ్ కేసులు

## -మరో 11మంది మృతితో 906కు చేరిన మరణాలు

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): గడిచిన 24గంటల్లో తెలంగాణలో కొత్తగా 2,392 కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,45,163కు చేరాయి. తాజాగా వైరస్‌తో 11 మంది మృతి చెందగా, మృతుల సంఖ్య 906కు చేరింది. తాజాగా వైరస్ నుంచి 2,346 మంది వైరస్ నుంచి కొలుకోగా, మొత్తం 1,12,587 మంది బాధితులు డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో 31,670 యాక్టివ్ కేసులు ఉన్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ పేర్కొంది. మరో 24,579 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రంలో కరోనా మరణాల రేటు 0.62శాతం ఉండగా, దేశంలో 1.69గా ఉందని చెప్పింది. అలాగే రికవరీ రేటు 77.5శాతంగా ఉందని పేర్కొంది. సోమవారం ఒకే రోజు 60,923 శాంపిల్స్ పరీక్షించగా.. ఇప్పటి వరకు 18,27,905 నమూనాలను పరిశీలించినట్లు తెలిపింది. ఇంకా 1,606 నమూనాల ఫలితాలు రావాల్సి ఉందని, పది లక్షల జనాభాకు 49,234 మందికి టెస్టులు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ వివరించింది. తాజాగా నమోదైన కేసుల్లో గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిదిలో 304 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయి. తర్వాత రంగారెడ్డి జిల్లాలో 191, కరీంనగర్‌లో 157, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 132, ఖమ్మంలో 116, నల్గొండలో 105, నిజామాబాద్‌లో 102, సూర్యాపేటలో 101, భద్రాద్రి కొత్తగూడెంలో 95, వరంగల్ అర్బన్‌లో 91 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. తెలంగాణలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 2,392 కరోనా కేసులు నమోదు కాగా.. 11 మంది మృతి చెందారు. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,45,163 కరోనా కేసులు నమోదు కాగా.. 906 మరణాలు సంభవించాయి. ప్రస్తుతం తెలంగాణలో 31,670 యాక్టివ్ కేసులుండగా.. చికిత్స పొంది 1,12,587 మంది డిశ్చార్జ్ అయ్యారు. తెలంగాణలో ఇప్పటివరకు 18,27,905 కరోనా పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలో రికవరీ రేటు 77.5 శాతం ఉండగా.. మరణాల రేటు 0.62 శాతంగా ఉంది. కొత్తగా జీహెచ్ఎంసీ పరిధిలో 304, రంగారెడ్డి 191, కరీంనగర్ 157, మేడ్చల్ 132, ఖమ్మం 116, నల్గొండ 105, నిజామాబాద్ 102, సూర్యాపేట 101, భద్రాద్రి 95, వరంగల్ అర్బన్‌లో 91 కేసులు నమోదయ్యాయి.

# వైద్యవిద్యలో ఇక 70:30 ఫార్ములా కోటా ఎత్తివేత

## ఒకే రాష్ట్ర విధానానికి సర్కార్ ఆమోదం

ముంబై,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో వైద్య విద్య కోసం ప్రాంతాల వారిగా అమలులో ఉన్న 70:30 అడ్మిషన్ ప్రక్రియను ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో వైద్య విద్యాశాఖ మంత్రి అమిత్ దేశ్‌ముఖ్ ప్రకటన చేశారు. నీట్ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఇక నుంచి వైద్య విద్య అడ్మిషన్లు జరుగుతాయన్నారు. 70:30 ఫార్ములా ప్రకారం.. 70 శాతం సీట్లు స్థానిక ప్రాంత వాసులకు, 30 శాతం సీట్లు రాష్ట్రంలోని ఇతర ప్రాంతవాసులకు గతంలో సీట్లను కేటాయించేవాళ్లు. 70:30 కోటా బదులుగా

ఇక నుంచి ఒకే మహారాష్ట్ర, ఒకే మెరిట్ విధానం అమలు అవుతుందని మంత్రి తెలిపారు. 70:30 కోటా విధానాన్ని రద్దు చేయాలని చాన్నాళ్లుగా విద్యార్థులు, పేరెంట్స్ డిమాండ్ చేస్తూ ఉన్నారు. పాత కోటా విధానం ప్రకారం మెడికల్ కాలేజీల్లో 70 శాతం సీట్లు స్వంత జిల్లా విద్యార్థులకే కేటాయించేవారు. అయితే మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాల్లో తక్కువ సంఖ్యలో మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇన్నాళ్లూ ఈ ప్రాంత విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. ఇప్పుడు ఆ సమస్య తీరనున్నది.

# దేశంలో మరో 75,809 పాజిటివ్ కేసులు నిర్ధారణ

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా మహమ్మారి ఉధృతి కొనసాగుతోంది. రోజురోజుకు పాజిటివ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ప్రపంచం వ్యాప్తంగా అత్యధికంగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయిన దేశాల్లో రెండో స్థానంలో నిలిచింది. తాజాగా దేశంలో 75,809 కొవిడ్ కేసులు నిర్ధారణ అయినట్లు కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వశాఖ మంగళవారం తెలిపింది. అలాగే వైరస్ ప్రభావంతో మరో 1,133 మంది మరణించారు. మొత్తం కేసుల సంఖ్య 42,80,423కు చేరాయి. ప్రస్తుతం 8,83,697 యాక్టివ్ కేసులున్నాయని, 33,23,951 మంది బాధితులు కోలుకున్నాని, 72,775 మంది వైరస్ ప్రభావంతో మరణించారని హెల్త్ మినిస్ట్రీ తెలిపింది. సోమవారం ఒకే రోజు 10,98,621 టెస్టులు చేయగా.. 5,06,50,128 శాంపిల్స్ పరీక్షించినట్లు ఐసీఎంఆర్ వివరించింది.

# భారత్ రెచ్చగొడుతూ సరిహద్దులు దాటుతోందన్న చైనా

## -డ్రాగన్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్ ఆర్మీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ఈస్టర్న్ లడాఖ్‌లోని పాన్‌గాంగ్ సరస్సు వద్ద సెప్టెంబర్ 7వ తేదీన జరిగిన ఘటనపై చైనా విదేశాంగ శాఖ ఇవాళ ప్రకటన విడుదల చేసింది. భారతీయ సైనిక దళాలు అక్రమంగా వాస్తవాధీన రేఖ దాటి, పాన్‌గాంగ్ సరస్సు వద్ద దక్షిణ ప్రదేశంలోకి ప్రవేశించినట్లు చైనా విదేశాంగ శాఖ ఆరోపించింది. భారతీయ దళాలతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్న తమ పెట్రోలింగ్ దళాలపై హెచ్చరిక కాల్పులు చేసినట్లు చైనా ఆరోపించింది. అయితే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తమ దళాలు ప్రయత్నించాయని చైనా పేర్కొన్నది. భారత్ తన వైఖరి అన్ని ఒప్పందాలను ఉల్లంఘించినట్లు చైనా విదేశాంగ శాఖ ఆరోపించింది. చాలా తీవ్ర స్థాయిలో సైనిక కవ్వింపు జరిగినట్లు డ్రాగన్ పేర్కొన్నది.

తక్షణమే ప్రమాదకరమైన ఎత్తులను ఆపేయాలంటూ దౌత్యపరంగా, సైనికపరంగా భారత్‌కు విన్నవించామని చైనా వెల్లడించింది. వాస్తవాధీన రేఖ దాటినవారిని వెంటనే వెనక్కి తీసుకువెళ్లాలని చైనా డిమాండ్ చేసింది. అయితే చైనా చేసిన ఆరోపణలను భారత ఆర్మీ ఖండించింది. భారతీయ పోస్టుల వద్దకు చైనా పీఎల్ఏ దళాలు వచ్చి ఫైరిరగ్‌కు పాల్పడినట్లు భారత రక్షణశాఖ చెప్పింది.

# యుద్ధంలో గెలిచనవాడే చరిత్ర రాస్తాడు

## బహుముఖ ప్రజ్ఞాశాలి మన పివి
## అసెంబ్లీలో మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): భారత మాజీ ప్రధాని పీవీ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా పీవీకి భారతరత్న ఇవ్వాలని సీఎం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీలో దీనిపై చర్చ సందర్భంగా ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్న ప్రకటించాల్సిందేనని అన్నారు. యుద్ధంలో గెలిచినవాడే చరిత్రను రాస్తారు అని ఒక సామెత ఉంది. రాష్ట్ర ఏర్పాటు జరిగి 6 సంవత్సరాలు పూర్తయింది. పీవీ ఒక్కరే కాదు.. తెలంగాణకు సంబంధించిన ఎంతో మందివైతాళికులు మరుగునపడ్డారు.. వారిని గుర్తించి గౌరవించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. ఈశ్వరీభాయి, భాగ్యరెడ్డి వర్మ, సురవరం ప్రతాపరెడ్డి, దొడ్డి కొమురయ్య, పైడి జయరాజ్, చాకలి ఐలమ్మ లాంటి ఎందరినో తెలంగాణ సాంస్కృతిక శాఖ గౌరవించుకుంది. మహానుభావుల జయంతి, వర్ధంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంది. వీరి స్ఫూర్తిని భవిష్యత్ తరాల్లో నింపాలి. పీవీ నరసింహరావు అద్భుతమైన వ్యక్తి. ఏ రంగంలో తనకు బాధ్యతలు అప్పజెప్పినా.. ఆ రంగంలో సంస్కరణలు చేపట్టి ప్రజలకు ఎంతో మేలు చేశారు. భూసంస్కరణలు మొదలు పెట్టి పేదలకు తన భూమిని పంచిన మహానుభావుడు పీవీ అని కేటీఆర్ గుర్తు చేశారు. తననుంచే సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు. మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. అసెంబ్లీలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. పీవీని ప్రపంచ దేశాలు గౌరవించాయి. కానీ దేశంలో మాత్రం పీవీకి సరైన గౌరవం దక్కలేదని తెలంగాణ ప్రజల హృదయాల్లోఉంది. ఈనాటి తరానికి వారి గొప్పసంస్కరణలు, మానవీయ కోణం అందరికీ తెలియాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలి అని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో స్మృతివనం ఏర్పాటు చేసి దానికి పీవీ పేరు పెడుతన్నామని సండ్ర వెంకట వీరయ్య తెలిపారు.

# మరిన్ని మహమ్మారిలను ఎదుర్కోవాల్సిందే

## కరోనాతోనే సంక్షోభం ముగియ లేదు
## ప్రజారోగ్యంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి
## అందుకు సంసిద్ధంగా ఉండాలన్న డబ్ల్యూహెచ్ఓ

జెనీవా,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారి లాంటి మరిన్ని సంక్షోభాలు ఎదుర్కొనేందుకు ప్రపంచదేశాలు సిద్ధంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ మరో హెచ్చరిక జారీ చేసింది. కరోనాతోనే సంఓభం సమిసి పోయిందను కోరాదని సూచించింది. కరోనా ధాటికి ప్రపంచదేశాలు సంక్షోభంలోకి వెళ్లడంతో ఈ మహమ్మారి నుంచి బయటపడేందుకు కృషి చేస్తూనే ఉన్నాయి. ఈ సమయంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా హెచ్చరిక జారీ చేసింది. లక్షలమంది ప్రాణాలు తీసుకుంటున్న మహమ్మారి, ఇదే చివరిది కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రెయేసస్ హెచ్చరించారు. 'వైరస్ ఉత్పాతాలు, మహమ్మారి విజృంభణలు నిజజీవితంలో తప్పవని చరిత్ర స్పష్టం చేస్తోంది. రాబోయే మహమ్మారిలను ఎదుర్కొనేందుకు ప్రస్తుతం ఉన్నదానికంటే మరింత సంసిద్ధంగా ఉండాలి. ఇందులో భాగంగా ప్రజారోగ్యంపై ప్రభుత్వాలు భారీగా ఖర్చుచేయాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ స్పష్టంచేశారు. స్పానిష్ ఫ్లూ మొదలుకొని సార్స్, మెర్స్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ వంటి ఎన్నో వైరస్‌లు విజృంభిస్తూ మానవాళికి సవాల్ విసురుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం కరోనావైరస్‌తోనే ఈ ప్రమాదం ముగిసిపోలేదని, రానున్న రోజుల్లో మరిన్ని మహమ్మారిలను ఎదుర్కొనేందుకు ప్రపంచదేశాలు అప్రమత్తంగా, మరింత సన్నద్ధతతో ఉండాలని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. ఇదిలాఉంటే, కేవలం ఏ ఒక్కదేశమో వ్యాక్సిన్ పంపిణీ చేపట్టినంత మాత్రాన మహమ్మారిని అరికట్టలేమని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది. దేశాలన్నీ అనుసంధా నమై ఉన్న ప్రపంచంలో, స్వల్ప ఆదాయ దేశాల ప్రజలకు వ్యాక్సిన్ అందకపోతే అది మరింత విస్తరించే ప్రమాదం ఉంటుందని తేల్చిచెప్పింది. అందుకే, ప్రతిదేశానికీ వ్యాక్సిన్ అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడింది. అందుకోసం కరోనా వ్యాక్సిన్‌ను అన్ని దేశాలకు సమానంగా అందేలా 'కొవ్యాక్స్' కార్యక్రమాన్ని చేపట్టింది. తద్వారా టీకా తయారుచేసుకోలేని, కొనలేని దాదాపు 100 దిగువ, మధ్యతరగతి దేశాలకు వ్యాక్సిన్ అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భారత్‌ను భాగస్వామిగా చేర్చుకునేందుకు డబ్ల్యూహెచ్ఓ ఇప్పటికే చర్చలు జరుపు తోంది. ఈ కార్యక్రమంలో చేరమని అమెరి కా ఇదివరకే ప్రకటించిన విషయం తెలి సిందే.

## అంబులెన్సుల కోసం చెక్కులు అందచేత

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా చేపట్టిన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమానికి భారీగా విరాళాలు అందుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి.. మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి అంబులెన్స్‌ల కొనుగోలు కోసం రూ. 20.50 లక్షల విలువ చేసే రెండు చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరిని మంత్రి కేటీఆర్ అభినందించారు. ఇప్పటికే పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వానికి అంబులెన్స్‌లను అందజేసిన విషయం తెలిసిందే.

## చరిత్రలో నేటినిజం



కం॥ శ్రీయుత "కాళోజీ"నా రాయణ రావు"ను దలతు తెలంగాణామునన్ ఆయుని సాహిత్యావళ్ళను పాయక పదు గురి కొసగిన భావతపస్వీన్!!

(సెప్టెంబర్ 9 కాళోజీ జననం...)

-రాధశ్రీ



సెల్: 9494481210

# కొత్త రెవెన్యూ చట్టం భూ తగాదాలను పరిష్కరించేనా?

నేటి నిజం

బుధవారం 9-9-2020

ఇటీవలి కాలంలో తహసిల్దార్ల వ్యవస్థ కారణంగా అనేకమంది అమాయక రైతులు ప్రాణాలు కోల్పోయారు. పురుగుల మందులు తాగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎందరో కార్యాలయాల్లో పురుగమందుల డబ్బాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు కనిపించారు. తమ భూములను వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశారనో ..లేదా తమ భూములకు పట్టాదారు పుస్తకాలు ఇవ్వడం లేదనో ఆందోళనలకు దిగారు. దీనికితోడు అనేక చోట్ల అక్రమ మ్యుటేషన్లు జరిగాయి. బలవంతపు బదిలీలు చోటు చేసుకున్నాయి. వీటన్నటిపైనా ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బాధితులకు భరోసా ఇవ్వలేదు. గత కొన్నేళ్లుగా ఇలాంటి దురాగతాలు జరిగినా...రైతులు బలవంతంగా ఉసురు తీసుకున్నా..అన్నింటికీ కొత్త రెవెన్యూ చట్టం ..పేరుతో కాలయాపన చేశారు. చట్టాలకు పదను ఉంది. వాటితో చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అయినా ఎందుకనో ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉన్నాయి. ఎన్నో కేసులు కోర్టుల్లో నలుగుతున్నాయి. కోర్టుల ద్వారా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. నిజానికి క్షేత్రస్థాయిలో అక్రమాలకు అడ్డుకట్ట పడడంతో పాటు, అక్రమార్కులకు అరదండాలు పడుతాయన్న భయం ఉంటే తప్ప భూ తగాదాలు రావు. కోర్టులకు వెళ్లరు. ఇలాంటి హామీలు కొత్త చట్టంలో ఉంటాయా లేదా అన్నది చూడాలి. కోర్టుల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే చట్టం ద్వారా సమస్యలు పరిష్కారం అయితే ప్రజలకు అంతకన్నా కావాల్సింది ఏమీ ఉండది. గతంలో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాక హడావిడిగా పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు చేయడంతో అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. రికార్డులు మారాయి. వీఆర్వో వ్యవస్థలను ఏర్పాటు చేసినా గ్రామాల్లో భూములకు సబంధించిన అనేకానేక కిరికిరిలు వచ్చాయి. తాజాగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుని రాబోతున్న కొత్త రెవెన్యూ చట్టం ఎలాంటి హామీ ఇస్తుందన్నది లేదు. అక్ర మాలను ఎలా అరికడతార్నది చూడాలి. రైతులకు సంబంధించిన భూముల రోణకు ఎలాంటి హామీ దక్క బోతుందో చూడాలి. దేవాదాయ భూముల అక్రమాలను ఎలా అరికడతారో చూడాలి. అలాగే ప్రభుత్వ భూముల కబ్జాలకు ఎలాంటి పరిష్కారం చూపుతారో చూడాలి. అలాగే ఒకే ప్లాటును పదిమందికి రిజిస్ట్రేష న్లు చేస్తున్న దగుల్బాజీలను ఎలా అడ్డుకుంటారో చూడాలి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో ఉన్న అనేకానేక సమస్యలు. వీటన్నిటికి తక్షణ ఔషధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థకు మంగళం పాడాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. కొంతకాలంగా రెవెన్యూ సంస్కరణలపై జరుగుతున్న ప్రచారం నిజమే నన్నట్లుగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వీఆర్వోలను తమ వద్ద ఉన్న గ్రామ రెవెన్యూ రికార్డులన్నింటినీ తహసీల్దార్లకు అప్పగించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణలు చేపట్ట బోతున్నట్లుగా ఏడాదిగా పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అయితే అప్పట్లో ఈ ఊహాగానాలపై రెవెన్యూ వర్గాలలో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. భూ రికార్డుల ప్రక్షాళన తరువాత గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ కారణంగా పెద్దఎత్తున అవినీతి, రికార్డుల తారుమారు వంటి అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో గ్రామరెవెన్యూ వ్యవస్థను సమూలంగా రద్దు చేసి రికార్డుల నిర్వహణ కోసం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలను అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇది ఎలా ఉండబోతుందన్నది ముందుగా బాగా ప్రచారం చేసివుంటే బాగుండేది. ఒకరైతు భూమిని మరొకరికి అక్రమంగా మ్యుటేషన్ చేస్తే ఎలాంటి చర్యలు ఉంటాయన్నది ముఖ్యం. భూముల అవకతవకలకు ఎలాంటి పరిష్కారాలు ఉంటాయన్నది ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం జరిగివుంటే ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే అవకాశం ఉండేది. రెవెన్యూ అవకతవకల కారణంగా గ్రామల్లో ఇరుగూ

పొరుగు, కుటుంబాల మధ్య కొట్లాట.. అన్నదమ్ముల మధ్య పంచాయితీలు...అయిన వాళ్ల మధ్య కొట్లాటలు, హత్యలు లాంటివి చూస్తున్నాం. వీటన్నింటికీ కారణం వ్యవస్థాగత లోపం అని అందరికీ తెలుసు. కొందరు దుర్మార్గపు అధికారుల అవినీతి.. చేతివాటం.. కాసుల కోసం రికార్డులను సైతం మార్చే దగుల్బాజీ తనం కారణంగా గ్రామాల్లో కక్షలు,కార్పణ్యాలు పెరిగాయి. రైతన్నకు ఇంతకాలం శాపంగా మారింది. బతుకు దెరువు చూపే భూమే భారంగా మారిన దుస్థితి అది.. తన అధీనంలో ఉండి, తాను దున్నుకునే భూమి, తనది కాదని ఎవరో అంటే.. ఇంకెవరి కాళ్లో పట్టుకొని పహాణీ కోసమో, పాసుపుస్తకం కోసమే కాళ్లరిగేలా తిరగాల్సిన దౌర్భాగ్యం పోతుందా అన్న ఉత్కంఠత ఇప్పుడు ఏర్పడింది. భూమి అంటే పంచాయితీ.. భూమి ఉంటే పంచాయితీ అన్నట్టుగా మారి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న వీఆర్వో వ్యవస్థను ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా రద్దు చేయడం మంచిదే అయినా పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో ఏర్పడ్డ అసమానతలను, అవకతవకలు పునరావృత్తం కాకుండా చేయాలి. రెవెన్యూ విభాగంలో సమూల సంస్కరణలు ప్రజలకు మేలు చేయగలగాలి.సరికొత్త రెవెన్యూ వ్యవస్థపై బిల్లులను క్యాబినెట్ ఆమోదించింది. దీన్ని బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు వీఆర్వోల వద్ద ఉన్న రికార్డులన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. కొత్త వ్యవస్థ ఏర్పడేదాకా రాష్ట్రంలో ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ సమూల ప్రక్షాళన ప్రారంభమైంది. అవినీతికి ఆస్కారంలేని నూతన రెవెన్యూ చట్టాన్ని ప్రవేశ పెట్టబోతున్నట్లు సంకేతాలు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం పలు విధాన నిర్ణయాలు తీసుకున్నది. రాష్ట్రంలో వీఆర్వోల వ్యవస్థను రద్దుచేసే బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనితోపాటు భూ లావాదేవీల్లో కోర్ బ్యాంకింగ్ తరహా వ్యవస్థను అమలుచేసేలా 'ది తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్ బిల్– 2020'ని ఆమోదించింది. ఈ చట్టంపై సమగ్ర చర్చ చేయాల్సి ఉంది. అలాగే మార్పులుచేర్పుల, సూచనలు సలహాలకు అవకావం ఇచ్చినప్పుడే సమగ్రత రాగలదు. అందుకు ప్రభుత్వం అసెంబ్లీలో చర్చను సాగిస్తే మంచిది.

## జాతీయ విద్యావిధానంపై గవర్నర్ల సమావేశం ప్రారంభ సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:జాతీయ విద్యావిధానం పై గవర్నర్ల సమావేశం ప్రారంభ సదస్సు ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సమావేశానికి భారతదేశ రాష్ట్రపతి తో పాటు వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, అన్ని రాష్ట్రాల విశ్వవిద్యాలయాల ఉప కులపతులు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, దేశం ఆకాంక్షలను నెరవేర్చడానికి విద్యావిధానం, విద్యావ్యవస్థ ముఖ్యమైన సాధనాలు అని స్పష్టంచేశారు.

విద్య బాధ్యత కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలదే అయినప్పటికీ విధాన రూపకల్పన లో వాటి జోక్యం కనీస స్థాయి లో ఉండాలని ప్రధాన మంత్రి అన్నారు. మరింత ఎక్కువ మంది ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థులు విద్యావిధానం తో అనుబంధాన్ని ఏర్పరుచుకొన్నప్పుడు విద్యావిధానం ఔచిత్యం, సమగ్రత పెరుగుతాయని ఆయన అన్నారు. దేశంలో పల్లెల్లో, నగర ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది ప్రజల నుంచి, విద్యారంగం తో సంబంధం ఉన్నవారి వద్ద నుంచి అభిప్రాయాలను అందుకొన్న తరువాతే నూతన విద్యావిధానానికి రూపకల్పన చేసినట్లు కూడా ఆయన వివరించారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో పాటు ప్రతి ఒక్కరు ఈ విధానాన్ని అక్కున చేర్చుకుంటున్నారని ఆయన అన్నారు.

ఈ విధానాన్ని అన్ని వర్గాలు ఆమోదిస్తున్నాయని, సంస్కరణలను ఇదివరకటి విద్యావిధానంలోనే ప్రవేశపెట్టి ఉండవలసిందన్న భావన ఏర్పడిందని ప్రధాన మంత్రి అన్నారు. ఈ విధానం పై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతూ ఉండటాన్ని ఆయన ప్రశంసించారు. అలాంటి చర్చ అవసరం కూడా, ఎందుకంటే జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) కేవలం విద్యావ్యవస్థ ను సంస్కరించడంపైనే కాకుండా 21వ శతాబ్దపు భారతదేశ సామాజిక వ్యవస్థ కు, ఆర్థిక వ్యవస్థ కు ఒక కొత్త దిశ ను అందించడానికి కూడా ఉద్దేశించిందని ఆయన చెప్పారు. ఈ విధానం భారతదేశాన్ని స్వయంసమృద్ధి తో కూడిన (ఆత్మనిర్భర్) భారతదేశం గా తీర్చిదిద్దడానికి ఉద్దేశించింది అని కూడా ఆయన అన్నారు.

శరవేగంగా మారుతున్న పరిస్థితులలో యువతను భావికాలానికి సన్నద్ధం చేయాలన్నదే ఈ విధానం లక్ష్యమని ప్రధాన మంత్రి అన్నారు. దేశ యువత ను జ్ఞానం పరంగా, నైపుణ్యాల పరంగా భవిష్యత్తు అవసరాల కు తగ్గట్టు సిద్ధం చేయడానికి ఈ విధానాన్ని రూపొందించడమైందని ఆయన అన్నారు.

నూతన విద్యావిధానం చదువుకోవడం కన్నా నేర్చుకోవడం పై శ్రద్ధ వహిస్తుందని, పాఠ్యప్రణాళిక పరిధి కి అతీతం గా పయనిస్తూ జిజ్ఞాస ను అలవర్చే ఆలోచనలు చేసేందుకు పెద్దపీట వేస్తుందని ప్రధాన మంత్రి తెలిపారు. ప్రక్రియ కన్నా అభినివేశానికి, ఆచరణీయతకు, పనితీరు కు మరింత ప్రాధాన్యతనిచ్చారని ఆయన చెప్పారు. నూతన విద్యావిధానం నేర్చుకోవడం తాలూకు ఫలితాలు, ఉపాధ్యాయుల శిక్షణ, ప్రతి ఒక్క విద్యార్థి సాధికారత పై శ్రద్ధ వహిస్తుంది అని ఆయన అన్నారు.

నూతన విద్యావిధానం భారతదేశాన్ని 21వ శతాబ్దంలో ఒక జ్ఞానభరిత ఆర్థిక వ్యవస్థ గా రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకొందని ప్రధాన మంత్రి అన్నారు. నూతన విద్యావిధానం ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారతదేశంలో ఆఫ్ షోర్ క్యాంపస్ లను నెలకొల్పేందుకు అవకాశాలను కూడా కల్పిస్తుందని ఆయన తెలిపారు. దీనితో మేధావుల వలస సమస్య కు పరిష్కారం లభించగలదని ప్రధాన మంత్రి చెప్పారు.

నూతన విధానాన్ని ఎలా అమలులోకి తీసుకురావాలని ప్రస్తుతం దేశం లో ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయని ప్రధాన మంత్రి అన్నారు. భయాందోళనలను తొలగించేందుకు విద్యారంగం తో భాగస్వామ్యం ఉన్న అన్ని వర్గాల సూచనలను, సలహాలను ఓపిక తో అరమరికలకు తావు లేకుండా వినడం జరుగుతోందని కూడా ఆయన వివరించారు. ఈ విద్యావిధానం ప్రభుత్వం విద్యావిధానం కాదని, ఇది దేశం యొక్క విద్యావిధానం అని ఆయన తేల్చి చెప్పారు.

జాతీయ విద్యావిధానం శరవేగం గా మారుతున్న కాలానికి అనువుగా రూపొందిందని ప్రధాన మంత్రి అన్నారు. ప్రాంతీయ, సామాజిక అసమానతల ను పరిష్కరించడం లో సాంకేతిక విజ్ఞానం హెచ్చుతగ్గులకు తావు లేకుండా చూస్తోందని ప్రధాన మంత్రి చెప్తూ, అలాగే సాంకేతిక విజ్ఞానం విద్య పై సైతం ఒక గొప్ప ప్రభావాన్ని ప్రసరిస్తోందన్నారు. ఉన్నత విద్య లో విద్యా విభాగం, సాంకేతిక విద్యా విభాగం, వృత్తివిద్యావిభాగం మొదలైన ప్రతి ఒక్క విభాగాన్ని కూడా గిరి గీసుకొని పరిమిత లక్ష్యాలతో పనిచేసే పద్ధతి ని త్రోసిరాజని, వాటిని సమగ్రంగా మలచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఎన్ఇపి -2020 స్ఫూర్తి ని తు.చ. తప్పకుండా అమలు చేయాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

## వీఆర్‌వోల నుంచి డిక్లరేషన్

### రికార్డులు లేవని హామీ పత్రం

కరీంనగర్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): తహసీల్దార్లు తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని, ఏమైనా జరిగితే తమదే బాధ్యత అని వీఆర్‌వోల నుంచి డిక్లరేషన్లు తీసుకున్నారు. సాయంత్రం కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కొందరు జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు ఉండగా, 215 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలో 140 రెవెన్యూ క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక వీఆర్‌వోను నియమించారు. జిల్లాలో 140 పోస్టులకు గాను, 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 121 మంది వీఆర్‌ఓలు పనిచేస్తున్నారు. వారి వద్ద ఉన్న అన్ని రకాల రికార్డులను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు రెవెన్యూ విధులను నిర్వహించరాదని వీఆర్‌వోలకు చెప్పారు. ఆ మేరకు జిల్లాలోని 14 మండలాల తహసీల్దార్లు వీఆర్‌వోల వద్ద ఉన్న పహణి పుస్తకాలు, రైతులకు ఇవ్వాల్సిన పట్టాదారు పాసు పుస్తకాలు, 1బీ రిజిష్టర్లు, అడంగల్ కాపీలు. మ్యూటేషన్ రిజిష్టర్లు, విచారణ కోసం తహసీల్దార్లు పంపించిన దరఖాస్తులు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు, ఇతరత్రా అన్ని రకాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్ని రకాల రికార్డులను స్వాధీనం చేసుకోవడంతో ఆ వ్యవస్థకు మంగళం పాడినట్లే అయ్యింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ధర్మారం, కమాన్‌పూర్ మండలాలలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో గల వీఆర్‌వోల వద్ద నుంచి రెవెన్యూ రికార్డులను తహసీల్దార్‌లు సంపత్, పాల్‌సింగ్‌లు స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం కల్లా మండల రెవెన్యూ కార్యాలయాల్లో అన్ని గ్రామాల వీఆర్‌వోలతో వారు సమావేశం ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు.

# కొత్త రెవెన్యూ చట్టంపై గ్రామాల్లో ఆసక్తి

### క్షేత్రస్థాయిలో అప్పుడే మొదలైన చర్చ
### చట్టం ఎలా ఉంటుందో అన్నదానిపై ఆరా

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం ఉన్న రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి నూతన చట్టాన్ని తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మొదట వీఆర్‌వోలను తొలగించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలని నిర్ణయించింది. దీంతో వీఆర్‌వోలు ఆందోళన చెందుతున్నారు. తమను ఏ శాఖలో విలీనం చేస్తారోనని, ఎక్కడికి బదిలీ చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. తాజాగా వారి వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులు, దరఖాస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్ సోమవారం ఉదయమే అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అయితే వీరిని కొత్తగా ఏర్పడే చట్టంలో ఎలాంటి పోస్టులతో వారిని కూర్చోబెడ తార్నది ఆసక్తిగా మారింది. అసెంబ్లీలో దీనికి సంబంధించి తీసుకుని రాబోతున్న చట్టంపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. గ్రామాల్లో ఒక్కరోజులనే వ్యవహారాలు మారాయి. ఎలాంటి చట్టం వస్తుందన్న ఆసక్తి నెలకొంది. రెవెన్యూ,రిజిస్ట్రేషన్ల శాఖ విలీనం కారణంగా సమగ్రత ఏర్పడుతుందన్న అభిప్రాయం కూడా ఉంది. ఒకే గొడుగు కిందకు ఇవన్నీ తేవడం వల్ల కొంత అవినీతితో పాటు అక్రమాలకు కళ్లెం వేయవచ్చని రిటైర్డు రెవెన్యూ అధికారులు కూడా చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వీఆర్వోలకు సహాయకులుగా వ్యవహరిస్తున్న వీఆర్ఏలను అలాగే కొనసాగించనున్నట్లు చెబుతున్నారు.

ప్రస్తుతం మండలానికి ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండగా కొత్తగా మరో ఇద్దరిని నియమించనున్నట్లు సమాచారం. తెలంగాణలో భూ సంబంధిత చ ట్టాలకు 113 ఏళ్ల చరిత్ర ఉంది. నిజాం కాలంలో 1907లో ఫస్లీ–1317 ద్వారా భూ చట్టాలను తీసుకొచ్చారు. ఇప్పటివరకు దీని ఆధారంగానే అన్ని కార్యకలాపాలు సాగాయి. హైద్రాబాద్ స్టేట్, ఆంధ్రప్రదేశ్ విలీనం తర్వాత భూ పరిపాలన, కౌలు దారులు, రైతుల హక్కులు, భూ సేకరణ, పంపిణీకి సంబంధించి ఒక్కో అంశంపై ఒక్కో చట్టం రూపొందించారు. ఇలా ఇప్పటివరకు అన్నీ కలుపుకొని 124 జీవోలు ఉన్నట్లు గుర్తించారు. వీటన్నింటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించి నట్లు తెలుస్తోంది. భూ రికార్డుల ప్రక్షాళన తరువాత రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి కాస్తు కాలంను తొలగించారు. దీంతో గ్రామ స్థాయిలో భూ పరిపాలనకు ఇక వీఆర్వోల అవసరం లేనట్లేనని ప్రభుత్వం భావించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేసి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వీఆర్‌వోల వల్ల రైతులు పెద్ద ఎత్తున ఇబ్బందులకు గురవుతున్నారని, వారి ద్వారానే అవినీతి ఎక్కువగా జరుగుతున్నదని ప్రభుత్వం గుర్తించింది.రెవెన్యూశాఖ పనితీరు పట్ల ఆగ్రహంగా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ శాఖనే ఎత్తివేసి అందులో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని ఇతర శాఖల్లో విలీనం చేయాలని ఎప్పటి నుంచో భావించారు. శాఖను ఎత్తివేయడం సాధ్యం కాదని, ప్రక్షాళన చేయాలని వచ్చిన సూచనల మేరకు ప్రక్షాళనకు నడుం బిగించారు. భూ ప్రక్షాళన వందకు వందశాతం పూర్తయిన తర్వాత నూతన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. ఆ మేరకు తొలుత రికార్డుల శుద్ధీకరణ చేపట్టారు. ఆర్డీవోలకు విశేష అధికారాలను కట్టబెట్టి, తహసీల్దార్లకు ఉన్న కొన్ని అధికారాలను కత్తిరించి, వీఆర్‌వోల వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా సంఘాల ప్రతినిధులతో సీఎం చర్చించారు. మరొకసారి కొన్ని సంఘాల నేతలు, నిపుణులతో చర్చించనున్నారు. వీఆర్‌వోల వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

# రిజిస్ట్రేషన్ల నిలిపివేతతో ఆదాయంపై ప్రభావం

### పదివేల కోట్ల లక్ష్య సాధనకు బ్రేక్
### కొత్త చట్టం వచ్చిన తర్వాతనే మరింత స్పష్టత

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ):కరోనా దెబ్బకు రిజిస్ట్రేషన్ల ఆదాయం ఇప్పటికే భారీగా పడిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10వేల కోట్లు సాధించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.1461 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో రిజిస్టరేషన్ల శాఖకు సెలవులు ప్రకటించడంతో ఆదాయం మరింత తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో పౌరులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సాంకేతిక మార్పులు తీసుకొస్తున్నామని, తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. సబ్‌రిజిస్ట్రార్, కార్యాలయాల్లో వీలునామా, వివాహాల నిర్వహణ, ఫ్రాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని, మళ్లీ చెప్పే వరకు రిజిస్ట్రేషన్లు మాత్రం చేయొద్దని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, ఈ–చలాన్ విక్రయాలను నిలిపివేశారు. గతంలో స్టాంపులు కొనుగోలు చేసిన, చలాన్లు చెల్లించినవారికి మాత్రమే సోమవారం రిజిస్ట్రేషన్లు చేశారు.

అయితే కొత్త రెవెన్యూ చట్టం రూపొందాక మళ్లీ యధావిధిగా కార్యకలాపాలు సాగుతాయని, ఆదాయాలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నూతన రెవెన్యూ చట్టాన్ని అనుసరించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం తాసిల్దార్లకు ఇచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. ఆలోగా రికార్డుల్లో అవకతవకలు, ట్యాంపరింగ్‌లకు ఆస్కారం లేకుండా చూసేందుకు వీఆర్వోల నుంచి రెవెన్యూ రికార్డులు సేకరించడంతో పాటు రిజిస్ట్రేషన్లను నిలిపివేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేన్లు అన్నీ ఇకపై మండలస్థాయిలో తాసిల్దార్లే చేసేస్తారు. దీంతో రిజిస్ట్రేన్, మ్యుటేషన్, పాస్‌బుక్కులు అంటూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఈ సేవలన్నీ ఒకేదగ్గర లభించే వీలుంది. అన్నింటికంటే ముఖ్యంగా రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతాయనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేన్ బాధ్యతను తాసిల్దార్లకు ఇచ్చి, ఓపెన్ ప్లాట్‌లు, భవనాలు, అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేన్లను మునుపటిలాగా సబ్‌రిజిస్ట్రార్లకే అప్పగిస్తారని.. ఈ చర్యల అనంతరం రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అవసరం ఉన్న చోట ఉంచి, కొన్నింటిని తగ్గించేస్తారని రిజిస్ట్రేషన్‌శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కంటే మరేది ముఖ్యం కాదనే ఉద్దేశంలో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు స్పష్టం అవుతున్నది.నూతన రెవెన్యూ చట్టాలు తేనున్న నేపథ్యంలో అంతకుముందే గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) దగ్గరున్న రికార్డుల న్నింటినీ స్వాధీనంచేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశాలతో రికార్డులన్నీ అధికారులకు చేరాయి. వీఆర్వోల వద్ద ఉన్న అన్నిరకాల రికార్డుల ఒరిజినల్, జిరాక్సు, ప్రింటెడ్ కాపీలను సోమవారం మధ్యాహ్నం లోగా సేకరించాలని, సాయంత్రం 4.30 గంటలలోగా నివేదికలను కలెక్టర్లకు అందజేయాలని తాసిల్దార్లను సీఎస్ ఆదేశించడంతో ఆగమేఘాల మీద రాత్రి వరకు రికార్డులు అందాయని సమాచారం. పహాణీలు, పీవోటీలు, టిప్పన్లు, గ్రామపటాలు వంటివాటిని సేకరించి భద్రపర్చాలని స్పష్టం చేశారు. అనంతరం రికార్డులను తీసుకున్నట్టు తాసిల్దార్లు ధ్రువపత్రం జారీచేయాలన్నారు. అదేసమయంలో తమ వద్ద ఉన్న అన్ని పత్రాలను సమర్పించినట్టు సంబంధిత వీఆర్వోలు 'నిల్ డిక్లరేషన్' ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఫార్మాట్‌ను విడుదలచేశారు. ఒకవేళ ఏదేని రెవెన్యూ అధికారి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేకుంటే నిల్ డిక్లరేషన్‌లో ఆ విషయాన్ని నమోదుచేయాలని స్పష్టంచేశారు. ఈ ధ్రువ పత్రాలలో ఒక కాపీని ఆర్డీవోల ద్వారా కలెక్టర్లకు అందజేయాలని చెప్పారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు వంటి సీనియర్ అధికారులను మండలా లకు కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. రికార్డుల అప్పగింత లేదా సేకరణలో వీఆర్వోలు, తాసిల్దార్లు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠినచర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వోలు తమ వద్ద ఉన్న అన్ని రకాలా పత్రాలను తాసిల్దార్లకు అప్పగించారు. భూరికార్డుల నిర్వహణ చేతిలో ఉన్న వీఆర్వోలు కొంతమంది తమ చేతివాటం చూపించడంతో రెవెన్యూశాఖకు అవినీతి మరకలు అంటాయి. వీఆర్వో వ్యవస్థ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్న అభిప్రాయం సర్వత్రా ఏర్పడింది. దీంతో భూ రికార్డుల నిర్వహణతోపాటు, భూ లావాదేవీల వ్యవహారాన్నంతా కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నది. ఈ క్రమంలోనే వీఆర్వోల వ్యవస్థను రద్దు చేస్తూ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. భూ లావాదేవీల్లో కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను అమలుచేసేలా 'ది తెలంగాణ రైట్స్ ఇన్ లాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్స్ బిల్–2020'కి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

# హరీష్ రావు కోలుకోవాలంటూ ప్రార్థనలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన అభిమానులు

సిద్దిపేట,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): మంత్రి హరీశ్‌రావుకు కరోనా పాజిటివ్ అని తేలడంతో ఆయన అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఆయనకు ఏం కాకూడదు అంటూ రాష్ట్ర వ్యాప్తంగా హరీష్ రావు అభిమానులు,టీఆర్ఎస్ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. హరీష్‌రావుకు కరోనా పాజిటివ్ అని తేలడంతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందారు. ఆయన త్వరగా కోలుకోవాలని, కరోనా మహమ్మారిని జయించాలని దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీపీ బాలమల్లు, టీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు కుంబల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా, నారాయణరావు పేట మండలంలోని బుగ్గ రాజేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి హరీష్ రావు బాగుండాలని, కరోనా వైరస్‌ను జయించాలని కోరుతూ ఆయన అభిమానులు, టీఆర్ఎస్ శ్రేణులు సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రం నుండి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. టీఆర్ఎస్ యువజన నాయకులు ఆకుబత్తిని రాము ఆధ్వర్యంలోని బృందం నంగునూర్ మండల కేంద్రంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా బయలుదేరారు.

కరోనా బారి నుండి త్వరగా కోలుకోవాలని అంబర్ పేట్–నల్లకుంట డివిజన్ టీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ మేరకు నల్లకుంట డివిజన్‌లోని గోల్నాక శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రభుత్వ ప్రకటనల్లో సమాచార నియంత్రణపై సుప్రీంకోర్టు నిర్దేశిత త్రిసభ్య కమిటీ 19వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:ప్రభుత్వ ప్రకటనల్లో సమాచార నియంత్రణపై సుప్రీంకోర్టు నిర్దేశిత త్రిసభ్య కమిటీ (సీసీఆర్‌జీఏ) 19వ సమావేశం ఈనెల 4వ తేదీన జరిగింది.

భారత ఎన్నికల విశ్రాంత ప్రధాన కమిషనర్ శ్రీ ఓం ప్రకాశ్ రావత్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఐఏఏ మాజీ అధ్యక్షుడు, ఏసియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్‌టైజింగ్ అసోసియేషన్స్‌కు చెందిన రమేశ్ నారాయణ్, ప్రసారభారతి బోర్డు తాత్కాలిక సభ్యుడు అశోక్ కుమార్ టాండన్ సభ్యులుగా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ప్రభుత్వ ప్రకటనల్లో సమాచార నియంత్రణపై రాష్ట్రాలన్నీ త్రిసభ్య కమిటీలను నియమించాలి. కర్ణాటక, గోవా, మిజోరం, నాగాలాండ్ ఇప్పటికే రాష్ట్రస్థాయి కమిటీలను నియమించాయి. తమ ప్రభుత్వ ప్రకటనల్లో సమాచారాన్ని పర్యవేక్షించేందుకు కేంద్ర కమిటీకి ఛత్తీస్‌గఢ్ అంగీకారాన్ని తెలియజేసింది.

ఇంకా రాష్ట్రస్థాయి కమిటీలను నియమించని రాష్ట్రాలను సీసీఆర్‌జీఏ తీవ్రంగా పరిగణించింది. సీసీఆర్‌జీఏ దృష్టిలో ఇది సుప్రీంకోర్టు ఆదేశాల ధిక్కారం. కమిటీకి వచ్చిన ఫిర్యాదులపై కొందరు వ్యక్తులకు ఇచ్చిన నోటీసులకు ఇంకా సమాధానాలు రాలేదన్న విషయాన్ని కూడా కమిటీ గుర్తించింది. కరోనా దృష్ట్యా వారికి మరికొంత సమయం ఇవ్వాలని నిర్ణయించింది.

తమ నిర్ణయాలను రాష్ట్రాలు పాటించకపోడాన్ని సీసీఆర్‌జీఏ తీవ్రంగా తీసుకుంది. సీసీఆర్‌జీఏ ఆదేశాలను పాటించకపోతే, సంబంధిత ప్రభుత్వాల నోడల్ సంస్థలు ఇకపై ప్రకటనలు ఇవ్వకుండా నిషేధం విధించాలని కూడా కమిటీ భావిస్తోంది. నోటీసులకు స్పందించకుండా కాలయాపన చేసే ప్రభుత్వాధికారులను, అవసరమైతే తమ ముందు హాజరయ్యేలా ఆదేశించాలని కూడా కమిటీ నిర్ణయించింది.

2015 మే 13వ తేదీన సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా, 2016 ఏప్రిల్ 6వ తేదీన... సంబంధిత రంగాల్లో నిపుణులు, నిష్పాక్షికంగా వ్యవహరించే ముగ్గురు సభ్యుల కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఖర్చుతో అన్ని మీడియాల్లో వచ్చే ప్రకటనల్లోని సమాచారాన్ని పర్యవేక్షించడం ఈ కమిటీ కర్తవ్యం. 2015 మే 13న వెలువడిన సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం "ప్రభుత్వ ప్రకటనల్లోని సమాచారం రాజ్యాంగ, చట్టబద్ధ బాధ్యతలకు, పౌరుల హక్కులు, అర్హతలకు సంబంధించి ఉండాలి", " ప్రకటనలోని సమాచార ఉద్దేశం, అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలను తీర్చేదిగా ఉండకూడదు", "ప్రకటన ద్వారా చేసే ప్రచారం న్యాయబద్ధంగా, సమర్థవంతంగా, తక్కువ ఖర్చుతో ఉండాలి", "చట్ట, ఆర్థిక నిబంధనలు, విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రకటనలు ఉండాలి".

ప్రభుత్వ ప్రకటనలు సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా ఉన్న సందర్భంలో ప్రజలు ఫిర్యాదులు చేస్తే స్వీకరించి పరిష్కరించడానికి, ప్రభుత్వాలకు తగిన సిఫారసులు చేయడానికి ఈ కమిటీకి సుప్రీంకోర్టు అధికారం ఇచ్చింది. కమిటీకి ఫిర్యాదులు చేయాలనుకుంటే చిరునామా: ది మెంబర్ సెక్రటరీ, కమిటీ ఆన్ కంటెంట్ రెగ్యులేషన్ ఇన్ గవర్నర్‌మెంట్ అడ్వర్‌టైజింగ్ (సీసీఆర్‌జీఏ), రూమ్ నం.469, ఫోర్త్ ఫ్లోర్, సూచన భవన్, సీజీవో కాంప్లెక్స్, లోధీ రోడ్, న్యూఢిల్లీ–110003. ఫోన్ నంబర్: 011–24367810, వాట్సాప్ నంబర్: +91 9599896993,

## రెండోదశ కోవాగ్జిన ప్రయోగాలకు అనుమతి

### –హరియాణాలోని పీజీఐ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

న్యూఢిల్లీ,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): భారత ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ తయారు చేసిన కొవాగ్జిన్ టీకా రెండోదశ ప్రయోగాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వీటి కోసం ఇప్పటికే భారత ఔషధ నియంత్రణ సంస్థ అనుమతులు పొందిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రెండోదశ ప్రయోగాలు జరిపేందుకు హరియాణా రోహతక్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్(పీజీఐ) వేదిక కానుంది. కొవాగ్జిన్ టీకా రెండోదశ మానవ ప్రయోగాల కోసం భారత్ బయోటెక్ నుంచి అనుమతి లభించిందని పీజీఐ వైస్ఛాన్సలర్ డాక్టర్ ఓపీ కల్రా మీడియాకు వెల్లడించారు. వీటికోసం 12ఏళ్ల నుంచి 65సంవత్సరాల వయస్సు కలిగిన దాదాపు 300మంది వాలంటీర్లు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరిలో ఇప్పటికే కొందరికి స్క్రీనింగ్ కూడా పూర్తైనట్లు ఆయన తెలిపారు. మరికొన్ని గంటల్లోనే వ్యాక్సిన్ డోసులు ఇక్కడకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు భారత్‌లో దేశీయంగా తయారుచేసిన రెండు వ్యాక్సిన్‌లు మానవ ప్రయోగదశలో ఉన్నాయి. ఐసీఎంఆర్ సహకారంతో భారత్ బయోటెక్ తయారుచేసిన కొవాగ్జిన్‌తోపాటు జైడస్ కాడిలా వృద్ధిచేసిన వ్యాక్సిన్ రెండోదశ ప్రయోగాలకు చేరుకున్నాయి. ఇదిలాఉంటే, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ–ఆస్ట్రాజెనికా అభివృద్ధిచేసిన టీకా మాత్రం సీరం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మూడోదశ ప్రయోగాలు కొనసాగుతున్నాయి. వీటిని భారత్‌తోపాటు బ్రిటన్, బ్రెజిల్, ఆఫ్రికా దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఈ ప్రయోగాలు ఆశాజనక ఫలితాలు ఉండొచ్చని సీరం ఇన్‌స్టిట్యూట్ అధినేత అదర్ పూనావాలా ఆశాభావం వ్యక్తం చేశారు. మరికొన్ని నెలల్లోనే వ్యాక్సిన్ రావడం గొప్ప విషయమని.. దీనికోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నట్లు ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

## పోషకాహార లోపం లేని భారత్ కోసం ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలని, పాల్గొనాలని "రాష్ట్రీయ పోషణ మాహ్" సందర్భంగా పిలుపునిచ్చిన కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:పోషకాహార లోపం లేని భారత్ కోసం అంతా ప్రతిజ్ఞ చేయాలని, కేంద్రం చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని "రాష్ట్రీయ పోషణ మాహ్" సందర్భంగా కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ప్రజలకు పిలుపునిచ్చారు. చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు సంపూర్ణ పోషకాహారం అందించడం ప్రధాని మోదీకి ఎప్పుడూ ప్రాధాన్యతాంశమని అమిత్ షా ట్వీట్ చేశారు.

2018లో ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన పోషన్ అభియాన్, దేశం నుంచి పోషకాహార లోపాన్ని తరిమికొట్టడంలో అద్భుత పాత్ర పోషిస్తోందని అమిత్ షా పేర్కొన్నారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు సంపూర్ణ పోషణ అందించేందుకు ఈ నెలలో దేశవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించడంపై మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందని అమిత్ షా వెల్లడించారు. ఈ పథకాన్ని బలోపేతం చేసేందుకు పోషకాహార లోపం లేని భారత్ కోసం ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలని, ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేంద్ర హోంమంత్రి పిలుపునిచ్చారు.

# జిల్లాలో మొత్తం రికార్డులు సరెండర్

ఆసిఫాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మొత్తం 15 మండలాలు, 335 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మరో 1053 ఆవాస ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడి రెవెన్యూ గ్రామాల్లో భూ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించడం కోసం మొత్తం 171 మంది గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులు మంజూరు చేశారు. కాగా ప్రస్తుతం జిల్లాలో 111 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి 60 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం 111 మంది వీఆర్వోలు రికార్డులను సరెండర్ చేశారు. దీంతో కొత్త రెవెన్యూ చట్టానికి అనుగుణంగా వీరిని ఏయే శాఖలకు కేటాయిస్తారనే దానిపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం జిల్లా రెవెన్యూ శాఖ హడావుడిగా వీఆర్వోల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకుంది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో పనిచేస్తున్న మొత్తం 111 మంది గ్రామ రెవెన్యూ అధికారులు తాము పనిచేస్తున్న గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను, 1బి, మ్యుటేషన్ దరఖాస్తులను, ధరణి ÷ల్స్, ఫామ్ 8, ఫామ్ 7, ఖస్రా పహాణి వంటి రికార్డులను తహసీల్దార్లకు సరెండర్ చేశారు.

# భద్రాద్రి జిల్లాలో మరో ఎన్‌కౌంటర్

## -ఆగ్రా కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

లక్నో,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఉన్న ఓ కెమికల్ ఫ్యాక్టరీలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని సికంద్రా ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. అయితే ఇప్పటికే వరకు ఆ దుర్ఘటనలో చనిపోయినట్లు ఎటువంటి సమాచారం లేదు. అగ్ని ప్రమాదం జరిగిన రసాయనిక ఫ్యాక్టరీ సమీపంలోనే కూరగాయల మార్కెట్ కూడా ఉన్నది. అయితే ఎగిసిపడుతున్న మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక దళాలు రంగంలోకి దిగాయి. భారీ స్థాయిలో నల్లటి పొగ కమ్ముకుంటోంది. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# టీపాలిసెట్ షెడ్యూల్ ఖరారు

## 12వ తేదీనుంచి పాలిసెట్ మొదటి విడత ప్రవేశాల పక్రియ

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): టీఎస్ పాలిసెట్-2020 ప్రవేశాల షెడ్యూల్ ఖరారు అయింది. ఈ నెల 12వ తేదీ నుంచి పాలిసెట్ మొదటి విడుత ప్రవేశాల పక్రియ జరగనుంది. 12 నుంచి 17వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. 14 నుంచి 18వ తేదీ వరకు ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. 14 నుంచి 20వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. 22న సీట్ల కేటాయింపు జరగనుంది. ఈ నెల 30 నుంచి పాలిసెట్ తుది విడుత ప్రవేశాల పక్రియ జరగనుంది. 30వ తేదీన, అక్టోబర్ 1న వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. అక్టోబర్ 3న తుది విడుత ప్రవేశాలకు సంబంధించి సీట్ల కేటాయింపు చేస్తారు. అదే నెల 7వ తేదీ నుంచి పాలిటెక్నిక్ విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. అక్టోబర్ 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రయివేటు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు అక్టోబర్ 8న మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు.

# ప్లాస్మా దానంతో ప్రాణదాతలుగా నిలవాలి

## -ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్ అవిష్కరణ

వరంగల్ అర్బన్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): ప్లాస్మా దానం చేసి ప్రాణదాతలుగా నిలవండని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. ప్లాస్మా దానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్‌కు సంబంధించిన కరోనా వ్యాధిగ్రస్తుల చికిత్స నిమిత్తం అత్యవసర సమయాల్లో కావాల్సిన ప్లాస్మాను సమకూర్చేందుకుగాను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నూతనంగా కోవిడ్-19 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం వరంగల్ కమిషనరేట్ అదనపు డీసీపీ గిరిరాజు, ఆర్.ఐ నగేష్ పర్యవేక్షణలో కరోనా వ్యాధి నుంచి కోలుకోని ఎ÷-లాస్మా దానం చేసేందుకు సిద్ధంగా వున్న ఎ÷-లాస్మా దాతల పూర్తి సమాచారాన్ని ఈ సెంటర్ ద్వారా సేకరించడం జరిగిందని అన్నారు. అదే విధంగా ప్లాస్మా అవసరమైన వారు ఈ కోవిడ్ కంట్రోల్ వాట్సప్ నంబర్ 9491873930కు పూర్తి సమాచారాన్ని అందజేస్తే వారికి ప్లాస్మా దానం చేసేందుకు ముందుకు వచ్చిన దాతల సెల్ నంబర్లతో కూడిన వివరాలను అందజేస్తామన్నారు. అదే విధంగా ఉత్తర తెలంగాణలోని జిల్లాలకు సంబంధించిన పోలీస్ కొవిడ్ కంట్రోల్ రూంలు ఈ వరంగల్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూంకు అనుసంధానమై వుంటాయన్నారు. కార్యక్రమములో సెంట్రల్, ఈస్ట్ జోన్ల ఇంచార్జ్ డీసీపీలు పుష్ప, వెంకటలక్ష్మి, అదనపు డీసీపీ గిరిరాజు, వరంగల్, కాజీపేట ఏసీపీలు ప్రతాప్, రవీందర్ కుమార్, ఆర్.ఐ నగేష్ పాల్గొన్నారు.

# చురుకుగా రెవెన్యూ రికార్డుల స్వాధీనం

## -కలెక్టర్ల పర్యవేక్షణలో కార్యాలయాలకు రికార్డులు

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో వీఆర్వోల నుంచి రెవెన్యూ రికార్డులను కలెక్టర్లు స్వాధీనం చేసుకునే పని వేగవంతంగా సాగుతుంది. ఆయా జిల్లాల్లో రికార్డులు తాసిల్దార్ కార్యాలయాలకు చేరుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలంతా రెవెన్యూ రికార్డులను కలెక్టర్లకు అప్పగించే పనిలో బిజీగా ఉన్నారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్న కేసీఆర్ సర్కార్ వీఆర్వో వ్యవస్థ రద్దుకు యోచిస్తుంది. రాష్ట్రంలోని వీఆర్వోల వద్దనున్న రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ నిన్న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లుగా సమాచారం. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకల్లా రికార్డులను స్వాధీనం చేసుకోవాలని, సాయత్రం 5 గంటల వరకు రికార్డుల స్వాధీనం ఏ మేరకు పూర్తయిందో నివేదికలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ అయినట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోల వద్ద నుంచి రికార్డులను స్వాధీనం చేసుకునే పక్రియ కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లాలో మధ్యాహ్నం వరకు 60 శాతం రెవెన్యూ రికార్డులు కలెక్టరేట్‌కు చేరాయి. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా, వీఆర్వోలు, వీఆర్ఏలు ఎలాంటి ఆందోళన వ్యక్తం చేయకుండా, స్వచ్ఛందంగా రెవెన్యూ రికార్డులను అప్పగిస్తున్నారని కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టానికి శ్రీకారం చుట్టడంతో ఒకింత ఆందోళన, మరికొంత ఆనందం నెలకొంది. వీఆర్వోలు, వీఆర్ఏలు బాధపడుతుండగా ప్రజలు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని బాధతో వీఆర్ఏ, వీఆర్వోలు స్వాగతిస్తూనే తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. మాతృసంస్థ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి వేరే శాఖకు వెళ్లమంటే తమకు ఇబ్బందేనని అభిప్రాయపడుతున్నారు.

# ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ సేవలకు మంత్రి కెటిఆర్ శ్రీకారం

## -అనధికార లే ఔట్లకు ఇదే మంచి తరుణమని వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ సర్వీసులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు.. ఎల్ఆర్ఎస్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఇదే మంచి అవకాశమన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా భూయజమానులు హక్కులను పొందడంతో పాటు.. ప్రభుత్వపరంగా మౌలిక సదుపాయాలను పొందడానికి అర్హులవుతారని ఆయన తెలిపారు. అక్టోబర్ 15లోగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు.. 2021 జనవరి 31లోగా క్రమబద్ధీకరణ ఫీజును పూర్తిగా చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ మిగులు భూములకు.. దేవాదాయ, చెరువుల శిఖం భూముల్లో ఉన్న ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ వర్తించదని కేటీఆర్ తెలిపారు. రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లే అవుట్ రూల్స్ 2020 ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఏరియా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆగస్టు 26 వరకూ రిజిస్ట్రేషన్ చేసుకున్న అనధికార, అక్రమ లే అవుట్‌లలోని స్థలాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ జీవో నంబరు 131ని జారీ చేశారు. ఈ పథకం రాష్ట్రమంతటికీ వర్తించనుంది. ఇదిలావుంటే 131 జీవోపై హైకోర్టులో పిల్ దాఖలైంది.

# తెలంగాణ విమోచనంపై మాట మార్చిన కెసిఆర్

### అధికారికంగా నిర్వహించడంలో రాజకీయం
### అధికారిక నిర్వహణ కోరుతూ చారిత్రక ప్రాంతాల్లో బండి పర్యటన
### తెలంగాణను ఏలలేని కెసిఆర్ దేశాన్ని ఏలుతాడా అంటూ ఎద్దేవా

యాదాద్రిభువనగిరి,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ డిమాండ్ చేసారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రోశయ్య తదితరులను విమర్శించిన కెసిఆర్ ఇప్పుడు ఎందుకు మౌనం వహించారని మండిపడ్డారు. విమోచనోత్సవాన్ని నిర్వహించాలని కోరుతూ ..నాటి చారిత్రక ప్రాంతాల సందర్శనలో భాగంగా యాదాద్రి జిల్లాకు చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.

బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంజయ్‌కు బోనాలతో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ విమోచనోత్సవ దినంసెప్టెంబర్ 17ని అధికారికంగా నిర్వహించాలని అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. భువనగిరిలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ మజ్లీస్ తో లోపాయకారి ఒప్పందంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారన్నారు. రాష్ట్రాన్ని ఏలని వాడు.. దేశాన్ని ఎలా ఉద్ధరిస్తాడని.. దేశాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే ఓ పాకిస్థాన్ కో, ఆఫ్ఘనిస్తాన్‌కో అంటగడుతారన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో హైదరాబాద్‌లోని వారి అక్రమ ఆస్తులను క్రమబద్ధీకరణ చేసుకోవటానికేనని.. ఎల్ఆర్ఎస్ పేరుతో పేదల రక్తం తాగుతున్నారన్నారు. రెవెన్యూ చట్టాన్ని నిర్వీర్యం చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారని..రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందని..ప్రజల దృష్టిని మరల్చడానికి కొన్ని పత్రికలలో అనుకూల వార్తలు రాయించుకుంటున్నారని బండి సంజయ్ తెలిపారు తెలంగాణ అమరవీరుల చరిత్రను ఈ తరానికి చాటి చెప్పేందుకు బీజేపీ 2 రోజుల యాత్ర కొనసాగుతోంది. ఈ యాత్రలో రజాకార్ల అరాచకాలు, అకృత్యాలకు గురైన స్థలాలను సందర్శిస్తున్నారు. ఉదయం భువనగిరి జిల్లా కొలనుపాక, రేణుకుంట, సిద్దిపేట జిల్లా భైరాన్ పల్లి, కూటిగల్లు, జనగామ జిల్లా తరిగొప్పులలో పర్యటించి తెలంగాణ అమర వీరులకు నివాళి అర్పించనున్నారు. మధ్యాహ్నం వరంగల్ అర్బన్, రూరల్ జిల్లా, పెద్దపల్లికి వెళ్తారు. రాత్రి గోదావరిఖని చేరుకొని అక్కడే బస చేస్తారు. ప్రస్తుతం యాదాద్రి జిల్లా భువనగిరిలో కొనసాగుతోంది. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి బండి సంజయ్ తన పర్యటనను ప్రారంభించారు. బండివెంట పొంగులేటి సుధాకర్ రెడ్డి, రామయచంద్రరావు, మోత్కుపల్లి నర్సింహులు తదితరులు ఉన్నారు.

# అమరావతి నుంచి అసెంబ్లీ కూడా తరలింపు

### కొడాలి నాని వ్యాఖ్యలతో దుమారం
### ప్రభుత్వ కుట్రలు తెలిసాయన్న రామకృష్ణ

అమరావతి,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల ఏర్పాటుకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సర్కార్ పూనుకుంది. ఆమేరకు రాజధానిని విశాఖకు తరలించే కార్యక్రమాల్లో భాగంగా కోర్టు ఆదేశాలతో కొంత నిరీఓణ చేస్తోంది. అయితే, ఈ దశలో ఏపీ మంత్రి కొడాలి నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో శాసనరాజధాని కూడా వద్దంటూ వ్యాఖ్యానించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లానని..

దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇక, అన్ని పక్షాలతో మాట్లాడి దీనిపై నిర్ణయం తీసుకుందామని మంత్రి కొడాలి నాని అన్నారు. దీనిపై వారం రోజుల క్రితమే స్పందించిన మంత్రి... తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో.. మూడు రాజధానుల వ్యవహారంపై ఇలా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో ఇప్పుడు మళ్లీ అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యింది. అయితే రాజధాని తరలింపు అన్నది మొత్తంగా ఉంటుందన్న భావన కలుగుతోంది.

మరోవైపు చంద్రబాబుకు ఎమ్మెల్యేల బలం లేదన్న మంత్రి కొడాలి నాని.. ఉన్నవాళ్లు కూడా జారిపోతున్నారని వ్యాఖ్యానించారు. లోకేష్‌ను ఎమ్మెల్యేను చేయడం ఎవరి వల్లా కాదు అంటూ ఎద్దేవా చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలిద్దామంటే కోర్టుకు వెళ్లి స్టే తేవడం విడ్డూరం అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ఇక, తన ప్రకటనలో.. అమరావతిలో శానస రాజధాని వద్దనే తన అభిప్రాయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఓవైపు.. రాజధానుల వ్యవహారంపై వివాదం కొనసాగుతూనే ఉండగా... ఇప్పుడు కొడాలి నాని స్టేట్‌మెంట్ కొత్త చర్చకు తెరలేపింది.. మరి దీనిపై సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది... ప్రతిపక్షాలు ఎలా స్పందిస్తాయనేది ఆసక్తిగా మారింది. ఇదిలావుంటే రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను మంత్రి కొడాలి నాని బయటపెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అమరావతిలో శాసన రాజధాని కూడా వద్దని మంత్రి కొడాలి నాని చెప్పటం దుర్మార్గమన్నారు. ఆనాడు అసెంబ్లీ సాక్షిగా అమరావతిలో రాజధానికి అంగీకారం తెలిపి, 33 వేల ఎకరాలు అవసరమన్న జగన్మోహన్ రెడ్డి.. ఈనాడు మాట తప్పడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. ఇప్పటికే దాదాపు రు.10 వేల కోట్లతో జరిగిన అభివృద్ధి ప్రాంతాన్ని ధ్వంసం చేస్తారా? అని నిలదీశారు. అమరావతి రైతుల ఉద్యమం 266 రోజులకు చేరుకుందన్నారు. 28 వేల మంది అమరావతి రైతుల ఉసురు తీసేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు.

వైసీపీ ప్రభుత్వ వివాదాల పాలన చరిత్రలో అత్యంత దారుణ పాలనగా మిగిలిపోతుందని రామకృష్ణ పేర్కొన్నారు

# చిన్నారులకు పౌష్టికాహారం కోసం పోషణ పథకం

### 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందచేత
### 26.36లక్షల మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు లబ్ధి
### హెల్దీ బాడీ, హెల్దీ మైండ్ చాలా అవసరం అన్న జగన్

అమరావతి,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): నేటి బాలలే రేపటి పౌరులని.. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం కోసమే సంపూర్ణ పోషణ పథకాలను ప్రారంభించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హెల్దీ బాడీ, హెల్దీ మైండ్ చాలా అవసరమని తెలిపారు. గర్భిణీల్లో 53 శాతం మందికి రక్తహీనత ఉందని,తక్కువ బరువున్న పిల్లలు సుమారు 32 శాతం మంది ఉన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గర్భిణీలు, బాలింతలు, 6 నుంచి 72 నెలలలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ కేంద్రాలుగా మార్చబోతున్నట్లు వెల్లడించారు. 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తాం. ప్రపంచంతో పోటీ పడే విధంగా ఇంగ్లీష్ మీడియాన్ని కూడా తీసుకొచ్చాం. తల్లులకు పోషణ, పిల్లలకు రక్షణగా వైఎస్ఆర్ పోషణ, వైఎస్ఆర్ పోషణ ప్లస్ పథకాలు ఉంటాయని సీఎం తెలిపారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద 26.36లక్షల మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం రూ.1,555.56 కోట్లు ఖర్చు చేయబోతున్నామని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం కింద 77 గిరిజన మండలాల్లో 3.80లక్షల మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం రూ.307.55 కోట్లు కేటాయించామన్నారు. మొత్తంగా సుమారు రూ.1863 కోట్లు ఖర్చు చేయబోతున్నామని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. మన పిల్లలు రేపటి పౌరులు, రేపటి ప్రపంచంతో వారు పోటీ పడే స్థితిలో ఉన్నారా? లేరా? అన్నది చూశాక వారిలో మార్పు తీసుకుని రావాలని అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకున్నామని సిఎం వివరించారు. నేటి తరంలో చాలా మందికి మంచి ఆహారం లభించడం లేదు. పిల్లలు, తల్లిదండ్రులు ఆ పరిస్థితిలో ఉన్నారు. వారందరిలో మార్పు తీసుకురావడం కోసమే ఈ పథకాలు చేపట్టామని అన్నారు. పేదల పిల్లలకు బలహీనత, రక్తహీనత వంటి అనేక అనారోగ్య సమస్యలు ఉన్నాయి. వాటికి సంబంధించి మన పిల్లలు ఎలా ఉన్నారన్నది చూస్తే, అలాగే తల్లుల పరిస్థితి చూస్తే.. గర్భవత్నుల్లో దాదాపు 53 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారు.

ఇంట్లో తినడానికి తగిన ఆహారం లేకపోతే, అది పిల్లల మేధస్సు, ఎదుగుదలలో కనిపిస్తోంది. తల్లిదండ్రులకు తగ్గట్లుగా పిల్లలు కూడా తగిన ఎదుగుదల లేక ఉన్నారు. అందుకే ఈ ప్రభుత్వం ముందుకు అడుగు వేసింది. ఆ దిశలోనే పిల్లలు, గర్భిణీలు, బాలింతల బాగు కోసం ఈ పథకాలు చేపట్టామని అన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్లస్ పథకాల ద్వారా దాదాపు 30.16 లక్షల అక్క చెల్లెమ్మలు, చిన్నారులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కోవిడ్ సమయంలో ఆదాయాలు పడిపోయాయి. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున బకాయిలు పెట్టి పోయింది. వాటన్నింటినీ తీరుస్తూ, అందరికీ మేలు చేయడం కోసం ఈ పథకాలు అమలు చేస్తున్నామని జగన్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, శంకర్ నారాయణ పాల్గొన్నారు.




నేత్రదానం చేస్తూ అంగీకారపత్రం అందచేసిన తమిళనాడు సిఎం పళనిస్వామి

# గ్రామాల విద్యుద్దీపాలకు ఇక మహర్దశ

## ఎల్ఇడి దీపాలపై ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని పల్లెలు సరికొత్త వెలుగులతో విరజిల్లనున్నాయి. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన విద్యుత్ దీపాలతో వీధి వీధిన కొత్త వెలుగు జిలుగులు సంతరించుకోనున్నాయి. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ అనుబంధంతో చీకటిని పారదోలుతూ మిరుమిట్లు గొలిపే నూతన వెలుగులు గ్రామాలకు అందనున్నాయి. అంతేకాదు విద్యుత్ ఆదాతో పాటు ఈఎంఐ సదుపాయం కూడా చేకూరనుంది. స్ట్రీట్ లైట్స్ తో స్టేట్ సెంటర్‌కు అనుసంధానం చేయడం వల్ల నిర్వహణ సామర్థ్యం పెరగనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో ఈఈఎస్ఎల్ గ్రామ పంచాయితీల మధ్య ఎల్ఈడీ వీధి దీపాల అమర్చే ఒప్పందం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లు అమర్చి నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ జాయింట్ వెంచర్ సంస్థ అయిన 'ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ' జిల్లా పంచాయతీ అధికారులు మధ్య తదనంతరం ఒప్పందం చేసుకోనున్నది. ప్రస్తుత ఈ ఒప్పందాన్ని అనుసరించి ఈఈఎస్ఎల్ వారు నాణ్యమైన ఎల్ఈడీ లైట్లు, ఫిక్సర్ సమకూర్చి వాటిని వీధి స్తంభాలకు అమర్చి వాటిని పర్యవేక్షించే బాధ్యతను తీసుకుంటారు. దీని కోసం గ్రామపంచాయతీలు వెంటనే ఎలాంటి పెట్టుబడి పెట్టనవసరం లేదు. వీధి లైట్లు అమర్చిన తరువాత నెలసరి వాయిదాల్లో ఈఈఎస్ఎల్‌కు చెల్లించవచ్చు. ఈ వీధి దీపాలు నేషనల్ లైటింగ్ కోడ్ ప్రకారం ప్రకాశవంతమైన వెలుతురును ఇస్తాయి. ఆటోమేటిక్ ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయడం ద్వారా చీకటి పడగానే లైట్లు వెలిగేలా, ఉదయం వెలుతురు రాగానే ఆగిపోయే విధంగా ఏర్పాటు చేస్తారు. దీంతో విద్యుత్ వృథాను అరికట్టవచ్చు. ఈ లైట్లలో కంప్యూటర్ చిప్‌ను అమర్చడం ద్వారా దానిని రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కంప్యూటర్‌లో అనుసంధానించడంతో ఎక్కడైనా లైట్ ఆన్ చేయకపోతే వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలోచనలతో గ్రామాలు మరింత అభివృద్ధి చెంది, పల్లెలు మన రాష్ట్రానికి పట్టుగొమ్మలు గా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఈఈఎస్ఎల్ ఎక్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సౌరబ్ కుమార్, పంచాయితీరాజ్ కమిషనర్ రఘునందన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులతో హోంమంత్రి సమీక్ష

## శాంతిభద్రతలపై పోలీసులకు అభినందన

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ సోమవారం పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అసెంబ్లీసమావేశాల సందర్భంగా చర్చించిన విషయాలను పోలీసు ఉన్నతాధికారులతో హోంమంత్రి సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాంతి భద్రతలను కాపాడడంతో పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన కృషిని, చేపట్టిన వినూత్న పథకాలను ఈసందర్భంగా పోలీసు అధికారులు వివరించారు.

హైదరాబాద్ నగరం సురక్షిత పట్టణంగా గుర్తింపు పొందడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలను సమర్ధవంతంగా నిర్వహించిన తీరుపై కూడా పోలీసులు హోంమంత్రికి వివరించారు. అలాగే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్, కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి పోలీస్‌స్టేషన్లు ఉత్తమ పోలీస్‌స్టేషన్‌లుగా పేరు తెచ్చుకోవడం, ఎన్‌సీఆర్‌బి డేటా ప్రకారం దాదాపు 65 శాతం పైగా కేసులు సీసీటీవీల సహకారంతో చేధించడం, షీటీమ్‌తో మహిళలకు భద్రతకల్పించడం, ఎన్నోసంచలనాత్మక కేసులను చేధించి నిందితులను పట్టుకోవడం వంటి ఎన్నో విషయాల ద్వారా తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ దేశంలోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుందని ఈసందర్భంగా పోలీస్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్త, అడిషనల్ డీజీపీ (శాంతి భద్రతలు) జితేందర్, కమిషనర్ అంజనీ కుమార్, మహేశ్‌భగవత్, సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# 266వ రోజుకు చేరుకున్న అమరావతి ఉద్యమం

## -కొనసాగుతున్న రైతుల ఆందోళనలు

అమరావతి,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): రాజధాని ప్రాంత రైతులు, మహిళల ఆందోళనలు 266వ రోజుకు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, తదితర గ్రామాల్లోని నిరసన దీక్షా శిబిరాల్లో కరోనా సూచనలు పాటిస్తూ రైతులు తమ నిరసనలను తెలుపుతున్నారు. రాజధానిగా అమరావతినే కొనసాగిం చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయంతో తమ జీవితాలు తలకిందులు అయ్యాయని వాపోతున్నారు. ప్రభుత్వం తమ ఆందోళనపై స్పందించిన రాజధాని మార్పు నిర్ణయాన్ని మార్చుకోవాలి డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతే కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పే వరకు తాము ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. మూడు రాజధానులను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అమరావతి రైతులు, రైతు కూలీలు తెలిపారు. అమరావతిని కొనసాగించాలని రైతులు చేస్తోన్న ఉద్యమం మంగళవారానికి 266వ రోజుకు చేరుకుంది. తుళ్లూరు, పెదపరి మి, నేలపాడు, అనంతవరం, మందడం, రాయపూడి, వెలగపూడి, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, ఐనవోలు తదితర గ్రామాలలో నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఉన్నత న్యాయస్థానాలు కలగజేసుకొని ప్రజలకు న్యాయం చేసే విధంగా తీర్పులిస్తున్నాయన్నారు. అయినా జగన్ మొండివైఖరి వీడటం లేదన్నారు. అమరావతి కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని పెనుమాక జేఏసీ నాయకులు దండమూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలు జరిగాయి. అమరావతి సాధించే వరకూ పోరాటం చేయకతప్పదని ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు తెలి పారు. సీపీఐ ఆధ్వర్యంలో మూడు రాజధానులు వద్దంటూ నిరసన తెలిపారు.మూడు రాజధానులకు వ్యతిరేకంగా తాడికొండ మండలం పొన్నెకల్లు, మోతడక గ్రామ రైతులు, మహిళలు నిరసనలు కొనసాగించారు. మూడు రాజధానులు, సీఆర్‌డీఏ బిల్లుల ఆమోదంపై గవర్నర్ పునఃసమీక్షించు కోవాలన్నారు.

# సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండండి

నిర్మల్,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారులు సూచించారు. కరోనా వేళ మలేరియా తదితర జ్వరాలకు దూరంగా ఉండాలన్నారు. డెంగీ కేసుఉల నమోదవుతున్న వేళ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యసిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో రోగులపై ఆరా తీసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. నీటి మడుగుల్లో పంచాయతీ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు.

# ప్రకాశంలో ఆగని కరోనా విజృంభణ

ఒంగోలు,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): ప్రకాశం జిల్లాలో కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. కరోనా కేసుల సంఖ్య 30వేలు దాటింది. తాజాగా 1136 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 30,805 లకు చేరుకుంది. ఒంగోలులో అత్యధికంగా 219 కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో కరోనా భారిన పడి ముగ్గురు మృతి చెందారు. జిల్లాలో ఇప్పటి వరకు కరోనా కారణంగా 333 మంది చనిపోయారు. సోమవారం నాడు కరోనా నుండి కోలుకుని 62 డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో14,024 యాక్టీవ్ కేసులు ఉన్నాయి.

# జిల్లాలో కొత్తగా 1072 కేసులు నమోదు

ఏలూరు,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): పశ్చిమ గోదావరి జిల్లాలో కొత్తగా 1072 కేసులు నమోదు అయ్యాయి. తాజాగా సోమవారం ఏడుగురు మృతి చెందగా.. తణుకులో అధికంగా నిన్న 106 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏలూరులో 69 కేసులు నమోదు కాగా.. జిల్లా వ్యాప్తంగా కేసుల సంఖ్య 48వేల162కి చేరుకుంది. ఇప్పటివరకు 360 మంది మృతి చెందారు. కొత్తగా కేసులు నమోదైన 19 ప్రాంతాల్లో అధికారులు కంటైన్ మెంట్ జోన్లను ఏర్పాటు చేశారు.

# అటవీ హక్కులు కల్పిస్తాం: ఐటిడిఎ పివో

ఆదిలాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): అర్హులైన గిరిజనులకు అటవీహక్కు పత్రాలు అందజేస్తామని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీవో భావేశ్ మిశ్రా అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి రేంజ్ డివిజన్‌లోని పోడు భూములు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో ఈ భూములు కడెం డివిజన్‌కి రాగా అటవీ అధికారులు తమపై కేసులు పెట్టి ఇందులోకి రానివ్వడం లేదని ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఆయన స్పందించి మండలంలోని రేవోజీపేట గ్రామ శివారులో కొద్ది సంవత్సరాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను ఇటీవల ఫారెస్టు అధికారులతో కలిసి పరిశీలించారు. పోడు భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీవో గిరిజనులతో మాట్లాడారు. సమస్యపై వాస్తవాలను తెలుసుకొని ఉన్నతాధికారు లతో చర్చించి భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాధ్యాయులు డిజిటల్ ద్వారా పాఠాలు బోధిస్తుండడంతో ఎంత మంది విద్యార్థులకు టీవీలు, స్మార్టు ఫోన్లు ఉన్నాయనే విషయంపై ఆరా తీశారు. విద్యార్థుల ఉన్న గ్రామాల్లో డిజటల్ బోధనపై పర్యవేక్షణ చేసి వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# కెసిఆర్ జాతీయ పార్టీ నవ్వుల పాలు కావాల్సిందే: జగ్గారెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): జాయీత రాజకీయాలపై ఉత్సాహంగ ఆఉన్న సిఎం కెసిఆర్‌కు భంగపాటు తప్పదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆయనకు అనేక పార్టీల నుంచి మద్దతు దక్కడం కష్టమని అన్నారు. దళిత వ్యతిరేకి అయిన కేసీఆర్ కు బీఎస్పీ అధినేత్రి మాయవతి మద్దతు ఇవ్వరని అన్నారు.

సిద్ధాంతాలు వేరు కావడంతో టీఆర్ఎస్ కు శివసేన కూడా మద్దతు పలకదన్నారు. ఢిల్లీ పీఠంపై కూర్చోవాలనే కల శరద్ పవార్, మాయావతిలకే నెరవేరలేదని? కేసీఆర్ దాని గురించి ఆలోచించక పోవడమే మంచిదని చెప్పారు. కేసీఆర్‌ను.. ఆయన మాటలు నమ్మదగినవి కావన్నారు. అంతేకాదు ప్రాంతీయ పార్టీని నడపడం, జాతీయ పార్టీని నడపడం రెండూ వేరన్నారు జగ్గారెడ్డి. ఎప్పుడూ నాలుగు గోడల మధ్య కూర్చొనే నాయకుడు జాతీయ పార్టీని నడపలేడని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కేసీఆర్ జాతీయ పార్టీని పెడితే నవ్వులపాలు అవుతారని చెప్పారు. కేసీఆర్ ను జాతీయ స్థాయిలో ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు.

# చలనాలపై అధికారులకు చర్యలు తీసుకోవాలి..!

సంగారెడ్డి సెప్టెంబర్ 8 ( నేటినిజం ప్రతినిధి )సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కరోన వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా పోలీసులు అక్రమంగా దొంగచాటుగా ఫోటోలు తీసి అడ్డగోలుగా వాహనదారులపై చాలనలు పంపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలు చేపడుతుంటే వన్ వే సర్వీస్ రోడ్లో వెళ్లినా కూడా వాహనదారులపై అక్రమంగా చలనాలు పంపుతున్నారు . సర్వీస్ రోడ్డు పై ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోగా అటువైపుగా వెళ్లాలా వెళ్లకూడదా అని వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు . సర్వీస్ రోడులో వెళ్లినప్పటికీ కూడా పోలీసులు ఎటువంటి సలహాలు ఇవ్వకుండా కనీసం బోర్డ్ మార్కింగ్స్ పెట్టకుండా అక్కడి నుండి వెళ్తున్న వాహనదారులపై ఫోటోలు తీసి చలానా లు పంపిస్తున్నారని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. పై అధికారులు తగిన చర్యలు తీసుకుని అక్రమంగా చాలనలు విధించే మార్గాలను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# ఐపియల్-2020 క్రికెట్ కేరింతలు కొట్టించేనా ?

కోవిడ్-19 విశ్వ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో నిశ్శబ్దంగా ఉన్న క్రీడాజగత్తులో ఒక్కసారిగా ఉత్సాహం నింపడానికి ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఐపియల్-2020 సిద్ధమైంది. ఉత్కంఠ వీడింది. ఎదురు చూసిన క్రికెట్ సంబరం రానే వస్తోంది. కరోనా వైరస్ కల్లోల వేళ నిర్వహిస్తున్న ఐపియల్-2020ని పూర్తి కట్టుదిట్టమైన "బయో-సెక్యూర్ బబుల్ (జీవ-సురక్షిత బుడగ లేదా కంచె)" ఏర్పాటు చేసి క్రికెట్ విందును ప్రేక్షకులను వడ్డించనున్నారు. తొలి మ్యాచ్ డిపెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మరియు రన్నర్స్ అప్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య సెప్టెంబర్ 19న అబుదాబి వేదికగా ప్రారంభం కానుంది. సుదీర్ఘంగా 53 రోజుల పాటు 56 మ్యాచ్‌లు మూడు సప్రాంగణాలలో జరుగనున్నాయి. అబుదాబిలో 20, దుబాయ్‌లో 24 మరియు షార్జాలో 12 మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహక బిసిసిఐ తెలిపింది. ఐపియల్-2020 లీక్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసిన బిసిసిఐ మిగిలిన ప్లే ఆఫ్ మరియు ఫైనల్ వేదికలను ప్రకటించాల్సి ఉంది. టోర్నీలో 10 డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30కి మరియు రెండో ఆట రాత్రి 7:30కి ప్రారంభమవుతాయి. ప్లే ఆఫ్‌లతో కలిపి 60 మ్యాచ్‌లు మరియు ఫైనల్ పోరు నవంబర్ 10న జరుగనుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌లలో క్వాలిఫైయర్-1, ఎలిమినేటర్ మరియు క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లు జరుగనున్నాయి. క్రికెట్ అభిమానుల్లో కిక్ ఇచ్చే డ్రీమ్-11 ఐపియల్ సీజన్-13 వేడుక కరోనా కారణంగా యూఏఈకి తరలిపోయింది. ఇప్పటికే అన్ని జట్లు 23 ఆగష్టున ఎడారి దేశానికి చేరి ప్రాక్టీసులు ప్రారంభించాయి. ఆదిలోనే సియస్‌కే జట్టులోని ఇద్దరితో పాటుగా 13 మంది క్రికెటర్లు కరోనా బారిన పడడంతో ఐపియల్-2020 కొంత ఆలస్యం అయిన విషయం మనకు తెలుసు.

'బయో-సెక్యూర్ బబుల్' క్రికెట్ అంటే....

కరోనా విజృంభన నేపథ్యంలో ఆడనున్న ఐపియల్-2020కి కట్టుదిట్టమైన ఏర్పాట్లను బిసిసిఐ చేసింది. ఆటగాళ్ళకు మరియు సపోర్టింగ్ స్టాఫ్‌కు కరోనా సోకకుండా "బయో-సెక్యూర్ బబుల్ లేదా జీవ-సురక్షిత బుడగ/కంచె/కవచం" నిర్మించడానికి విస్తృత ఏర్పాట్లను చేశారు. క్రికెటర్లు మరియు సహాయక సిబ్బంది ఉండే ప్రదేశాలైన హోటల్స్, క్రీడామైదానం, స్విమ్మింగ్ పూల్, ప్రాక్టీస్ ఏరియా, డ్రస్సింగ్ రూమ్స్, జిమ్నాజియం, సైక్లింగ్ ట్రాక్ లాంటి ప్రదేశాలను కరోనా రహిత ప్రదేశాలుగా కనిపించని శాస్త్రీయ కంచెను ఏర్పరిచారు. ఈ విధంగా కరోనా వంటి వ్యాధికారక జీవులు మరియు ఇతర వైరస్‌లు వ్యాపించకుండా ఆయా ప్రాంతాలను ఐసొలేట్ చేయడాన్ని 'బయో-సెక్యూర్ బబుల్' అంటారు. బ్రిటీష్‌కు చెందిన'రెస్ట్రాటా టెక్నాలజీ' సంస్థ వారు బిసిసిఐ సూచించిన ప్రోటోకాల్స్ (నిర్వహణ నియమాలు) పాటిస్తూ పూర్తి బబుల్ భద్రత ఇవ్వనున్నారు. ఇటీవల జరిగిన ఇంగ్లాండ్ వెస్ట్ ఇండీస్ టెస్ట్ సీరీస్ మరియు ఇప్పుడు జరుగుతున్న ఇంగ్లాండ్ పాకిస్థాన్ సీరీస్‌కు బయో-సెక్యూర్ బబుల్‌ను ఏర్పాటు చేసింది కూడా రెస్ట్రాటా కంపెనీయే అని గుర్తింపు కావాలి. ఐపియల్-2020లో 8 జట్లు పాల్గొననున్నాయి. ఒక్కొక్క జట్టులో ఆటగాళ్ళు మరియు సహాయ సిబ్బంది కలిపి 60 మంది ఉంటారు. బయో-సెక్యూర్ బబుల్‌లోకి చేరడానిక ముందు ఒక్కొక్కరు మూడుసార్లు కోవిడ్-19 పరీక్షలు చేసుకోవలసి ఉంటుంది. జీవ-సురక్షిత కంచెలో ఉన్న వారందరూ రెండు మరియు మూడవ వారంలో కోవిడ్-19 పరీక్షలు తప్పక చేయించుకోవాలనే కఠిన నిబంధనలు పెట్టారు. స్టేడియంలో ప్రేక్షకులు లేకుండా టివి లైవ్ టెలికాస్ట్ చూసే వారికి మాత్రమే పరిమితమై జరిగే ఈ మ్యాచ్‌లలో ఛీర్ గర్ల్స్ నాట్యాలు మరియు సంగీతాలు ఖాళీ ప్రాంగణంలో ప్రతిబించనున్నాయి. ఒక్కరికి కరోనా సోకినా పెద్ద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రత్యేక సందర్భానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కసారి బయో-సెక్యూర్ బబుల్‌లోకి ప్రవేశించిన వారు బయటకు రావడానికి గాని లేదా ఇతరులు ప్రవేశించడానికి గాని అవకాశం ఉండదు. ఈ నియమ నిబంధనలు పాటించిన వారికి బిసిసిఐ కఠిన శిక్షలు కూడా వేయనుంది. సెక్యూరిటీ మరియు ట్రాన్స్ పోర్ట్ సిబ్బంది కూడా రెండు సార్లు కోవిడ్-19 పరీక్షలు చేసుకున్న తరువాతనే బబుల్‌లోకి అనుమతించడం జరుగుతుంది. మ్యాచ్ జరిగే ప్రాంగణంలో 450 మంది (ఆటగాళ్ళు, సహాయక సిబ్బంది, నిర్వహకులు, టివి సిబ్బంది, భద్రతా సిబ్బంది, హౌజ్ కీపింగ్, సర్వింగ్ స్టాఫ్ మరియు అడ్మినిస్ట్రేటర్స్, ఛీర్ గర్ల్స్) జీవ-సురక్ష కవచంలో ఉండనున్నారు. క్రీడాకారులు కూడా వీలైనంత వరకు సామాజిక దూరాలు పాటిస్తూ, మాస్కులు ధరిస్తారు. వికెట్ పడినపుడు ఆటగాళ్ళ సంబరాలు మరియు బౌలర్లు బంతికి ఉమ్మి రాయడం వంటివి నిషేధించబడినవి. క్రీడాకారులు తమ త్రాగు నీటి బాటిళ్ళను తామే తెచ్చుకోవలసి ఉంటుంది. ఒకవేళ మధ్యలో కోవిడ్-19 పాజిటివ్ వచ్చినట్లైతే, విధిగా 14 రోజులు క్వారంటైన్‌లో ఉండి నెగెటివ్ వచ్చిన తరువాతనే బబుల్‌లో చేరాల్సి ఉంటుంది.

ఐపియల్-2020 ఆటగాళ్ళు మరియు సహాయక సిబ్బంది దాదాపు 80 రోజులు జీవ-సురక్షిత కవచంలో ఉంటారు. ప్రతి జట్టులో కోవిడ్-19 నిపుణులు మరియు బబుల్ దాటకుండా చూసే భద్రతా సిబ్బంది ఉన్నారు. ఐపియల్-2020 క్రికెటర్లు మరియు సహాయక సిబ్బంది కరోనా విధించిన నియమనిబంధనలకు లోబడి తమ ప్రతిభను చూపుతూ, ప్రపంచవ్యాప్త క్రికెట్ అభిమానులకు బ్యాట్ బంతి పోరును మరోసారి ఆసక్తికరంగా పరిచయం చేయనున్నారు. గెలుపోటములు సహజమైనవి. గెలవడం ఆనందాన్ని మరియు ఓడడం పట్టుదలను (కక్షను కాదు) పెంచాలి. ఎవరు ఓడినా, ఎవరు గెలిచినా చివరకు క్రికెట్‌దే అంతిమ విజయం కావాలి. కరోనాను ఓడిస్తూ, శాంతియుతంగా, సురక్షితంగా ఐపియల్-2020 జరగాలని ఆశిద్దాం,



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# తెలుగు చిత్రసీమలో నట జయప్రకాశం

## సొంత మేనరిజంతో ఆకట్టుకున్న అరుదైన నటుడు

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ):నటనకు సరికొత్త నిర్వచనం చెప్పిన నటుడు జయప్రకాశ్ రెడ్డి అనడంలో సందేహం లేదు. ఆయన ఏ పాత్రలో అయినా ఇమిడి పోగలరు. అలగే తనకంటూ ఓ మేనరిజాన్ని ఏర్పరచుకుని తెలుగుచిత్ర సీమలో ప్రత్యేకస్థానం సంపాదించారు. పాత్ర ఏదైనా అది పండించే గొప్ప అనుభవాన్ని రంగరించుకున్న అరుదైన నటుల్లో ఆయన ముందుంటారు. పాతతరంలో గుమ్మడి తదితరుల కోవలో ఏ పాత్ర అయినా అవలీలగా చేయగల సామర్థ్యాన్ని తన సొంతం చేసుకున్న నటుడు జయప్రకాశ్ రెడ్డి. ఆయన మరణం తెలుగుచిత్ర సీమకు తీరని లోటు. విలన్‌గా, కమెడీయన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న జయప్రకాశ్ రెడ్డి(74) హఠాన్మరణం తెలుగు సినీ పరిశ్రమని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మరణ విషయం తెలుసుకున్న అభిమానులు శోకసంద్రంలో మునిగారు. రాయలసీమ యాసలో ఆయన చెప్పే సంభాషణలు ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తుంటాయి. కుర్ర హీరోలతో పాటు సీనియర్ హీరోలందరితో కలిసి పని చేసిన జయప్రకాశ్ రెడ్డి చివరిగా సరిలేరు నీకెవ్వరు చిత్రంలో కనిపించారు.

జయప్రకాశ్ రెడ్డి స్వస్థలం కర్నూలు జిల్లా, ఆళ్ళగడ్డ మండలంలోని శిరువెళ్ళ గ్రామం. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన తండ్రి సాంబిరెడ్డి యాదృచ్ఛిక పేజీ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. నెల్లూరులోని పత్తేకాన్‌పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు చదివాడు. తర్వాత నెల్లూరులోని రంగనాయకులపేట లోని ఉన్నత పాఠశాలలో చేరాడు. ఇతడు పదోతరగతిలో ఉండగా నాన్నకు అనంతపురం బదిలీ అయ్యింది. అక్కడ సాయిబాబా నేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీలో చేరాడు. చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఆసక్తి ఉండేది. జయప్రకాశ్ రెడ్డి తండ్రి కూడా నటుడే కాబట్టి కొడుకుని ఎంతగానో ఎంకరేజ్ చేసేవారు. ఇద్దరు కలిసి పలు నాటకాలు కూడా చేశారు. చదువులోను చురుకుగా ఉండే జయప్రకాశ్ డిగ్రీ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని గణితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. అయితే తను చదుకునే సమయంలో ఆయన స్నేహితుడు ఇతడి స్నేహితుడు 'దుర్యోధన గర్వ భంగం' అనే నాటికలో పద్యాలు, డైలాగులు బట్టీ కొట్టేసి ఆయన దగ్గరకెళ్లి టపటపా అప్పజెప్పేశారు. ఈ విషయంపై ఫైర్ అయిన టీచర్ 'మళ్లీ నాటకాల పేరెత్తితే తన్నేస్తాను వెధవల్లారా..' అంటూ అరిచారు. ఇక్కడ కాస్త ఫీలైన జయప్రకాశ్ నటనను వృత్తిగా స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నాడు. నల్గొండలో గవ్ అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్న సమయంలో జయప్రకాశ్ నటన దాసరి నారాయణరావుకు ఎంతగానో నచ్చింది. వెంటనే రామానాయుడుకు పరిచయం చేశారు. 1988లో విడుదలైన బ్రహ్మపుత్రుడు చిత్రంలో వెండితెరకు పరిచయం అయ్యారు. 1997 లో విడుదలైన ప్రేమించుకుందాం రా చిత్రం ప్రతినాయకునిగా ఇతనికి మంచి పేరు వచ్చింది. తరువాత బాలకృష్ణ కథానాయకుడిగా వచ్చిన సమరసింహారెడ్డి, నరసింహనాయుడు లాంటి విజయవంతమైన సినిమాల్లో కూడా ఇలాంటి పాత్రతోనే ప్రేక్షకులను మెప్పించాడు. విప్లవ చిత్రాల దర్శకుడు ధవళ సత్యం దర్శకత్వంలో జయప్రకాశ్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేసన్నా 'అలెగ్జాండర్'(ఒక్కడే నటుడు.. అతడే నట సైన్యం అనేది ట్యాగ్‌లైన్) పేరుతో ఓ సినిమాను కూడా నిర్మించారు. రాయలసీమ స్లాంగ్‌లో జయప్రకాశ్ రెడ్డి చెప్పే డైలాగ్స్ ప్రేక్షకులకి మరింత వినోదాన్ని అందిస్తుంటుంది. జయం మనదేరా, విజయరామరాజు, చెన్నకేశవ రెడ్డి, నిజం, ఛత్రపతి, సీతయ్య, విక్రమార్కుడు, పలనాటి బ్రహ్మనాయుడు, బిందాస్, గబ్బర్‌సింగ్, నాయక్, బాద్షా, రేసుగుర్రం, మనం, రెడీ, పటాస్, టెంపర్, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, సుప్రీమ్, ఖైదీ నంబర్ 150, జై సింహా, రాజా ది గ్రేట్ వంటి చిత్రాలలో నటించిన జయప్రకాశ్ రెడ్డి ఇక మన మధ్య లేరనే వార్తతో వార్త తెలిసి టాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి




# పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్.... హనుమంతరావు



సంగారెడ్డి, సెప్టెంబర్ 9 (నేటినిజం ప్రతినిధి) రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు మమేకమై వారికి అన్ని విధాల సహకరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు వ్యవసాయ అధికారులకు సూచించారు.మంగళవారం సంగారెడ్డ మండలం తాళ్లపల్లి, మునిపల్లి మండలం హైద్లాపూర్ గ్రామాలలో పంటల నమోదు ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు ఆన్లైన్లో నమోదు చేసిన పంటల వివరాలను, రైతులు క్షేత్రంలో వేసిన పంటలు ఒకటేనా అన్న విషయాన్ని కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు. పొలాల వద్ద రైతులతో నేరుగా మాట్లాడి పలు విషయాలను ఆరా తీశారు. ఎన్ని ఎకరాలు సన్నాలు వేశారు, ఎన్ని ఎకరాలు ఉంది, మిగతాది ఏ పంట వేసావు, వ్యవసాయ అధికారులు పంటల విషయంలో ఏవైనా సలహాలు, సూచనలు ఇస్తున్నారా, సమస్యలుంటే పరిష్కరిస్తున్నారా అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్ లో నమోదైన మేరకు క్షేత్రాలలో అవే పంటలు సాగు చేస్తుండడంతో కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు.రైతులు పంటల విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలను పాటిస్తూ అధిక ఉత్పత్తి నీ సాధించాలన్నారు. తాళ్లపల్లి లో రైతులు విద్యుత్ సమస్య ఉందని కలెక్టర్ కు తెలుపగా వెంటనే విద్యుత్ శాఖ ఏ డి తో ఫోన్లో మాట్లాడి సాయంత్రంలోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు అవసరం లేని ఎరువులను అంటగడుతున్న డీలర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అవసరమైతే లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, ఎడిఎ మనోహర మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ , ఏ ఈ ఓ లు , ఆయా గ్రామల సర్పంచులు, గ్రామ సహాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని మార్చాలన్నదే వైకాపా నిర్ణయం

### మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలతో

### బట్టబయలు: ఎంపి రఘురామ

న్యూఢిల్లీ, సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): అమరావతిలో దళితులకు చోటులేనప్పుడు.. శాసన రాజధాని కూడా ఉంచకుండా మొత్తం విశాఖకు తరలిస్తామన్న మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలపై నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు తీవ్రంగా స్పందించారు. అమరావతిపై ప్రభుత్వ వైఖరిని మంత్రి కొడాలి నాని ప్రకటించారని అర్థం అవుతోందని అన్నారు. రాజధానిని పూర్తిస్థాయిలో తరలించాలన్న ఉద్దేశ్యాన్ని బట్టబయలు చేశారని అన్నారు. మొత్తం రాజధానిని విశాఖకు తరలించాలని చూస్తున్నారు. మంత్రి కొడాలి నాని పిత్రు బాషా ఎక్కువగా వాడుతున్నారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకోకుంటే ఉన్న ఈ చిన్న రాజధానిని కూడా తరలిస్తామంటూ కొడాలి నాని బెదిరిస్తున్నారని వ్యాఖ్యానించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నదే వైఎస్సార్ ముఖ్య ఉద్దేశ్యం. విద్యుత్ వినియోగం ఎంత జరుగుతుందో లెక్క ఉండాలని కేంద్రం చెప్పింది. రైతులు ఎందుకు ఆందోళన చెందుతున్నారో ప్రభుత్వం ఆలోచించాలి. రాయలసీమలో వ్యవసాయదారుల ఇబ్బందులు అధికం. ట్రాన్స్‌ఫార్మర్లకు మీటరు పెట్టి వచ్చే బిల్లులను సకాలంలో చెల్లిస్తే రైతులకు భరోసా కలిగే అవకాశం ఉంది. ఉచిత విద్యుత్ నగదు బదిలీ పథకం శ్రీకాకుళంలో కాకుండా కడపలో ప్రారంభిస్తే ప్రజల స్పందన తెలుస్తుంది. రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రఘురామ తెలిపారు. అక్షరాస్యతలో ఏపీ చివరిస్థానంలో నిలవడం విచారకరం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం. రాజ్యాంగాన్ని సమర్థించడాన్ని తప్పుపడుతూ నాపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా మాట్లాడే బాధ్యత నాపై ఉంది. రాజ్యాంగాన్ని గౌరవించేవారికి వైసీపీలో స్థానంలేదనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. దేవాలయ సంరక్షణకు ఇప్పటికైనా చర్యలు తీసుకోవడం మంచి పరిణామం అని అన్నారు. హిందూ వ్యతిరేకమనే భావన కొంతమంది ఉన్మాదుల చర్యల మూలంగా కలుగుతోంది. ప్రభుత్వానికి, సీఎంకు హిందూ మత విశ్వాసాలపై అపార గౌరవం ఉందని రఘురామకృష్ణరాజు కితాబు ఇచ్చారు.

# జాతీయ రాజకీయాలకు ఇప్పుడే తొందరలేదు

### సోషల్ మీడియా ప్రచారం నమ్మొద్దు
### దుబ్బాక ఉపఎన్నికల్లో లక్షమెజార్టీతో గెలుస్తాం
### జిహెచ్ఎసిలో మళ్లీ మనదే పైచేయి
### టీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో సిఎం కేసీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): జాతీయ రాజకీయాలకు ఇప్పుడే తొందరలేదని సిఎం కెసిఆర్ అన్నారు. జాతీయ రాజకీయాలకు తాను ఇప్పుడే పోవాల్సిన అవసరం లేదన్నారు. నయా భారత్ లేదు.. గియా భారత్ లేదు.. జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. అవసరమైనపుడు అందరితో చెప్పి చేస్తామన్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో లక్షమెజార్టీతో గెలుస్తామన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్.

సోషల్ మీడియాను నమ్మొద్దని.. అది యాంటీ సోషల్ మీడియాగా మారిందని అన్నారు. క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన టీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. జాతీయ స్థాయిలో కొత్త రాజకీయ పార్టీ పెడుతున్న వస్తున్న వార్తలపై తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పందించారు. కొత్త రాజకీయ పార్టీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజంలేదని కొట్టిపారేశారు. జాతీయ స్థాయిలో పార్టీ ఏర్పాటుపై భవిష్యత్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దేశాన్ని సర్వనాశనం చేశాయని, ఆ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటైన నేపథ్యంలో ప్రగతి భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన టీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీ ముగిసిన అనంతరం సీఎం మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ లక్ష మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాలను ఏ ఒక్కరూ ఆశామాషీగా తీసుకోవద్దని, ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని సభ్యులకు హితబోధ చేశారు.

అన్ని అంశాలపై సభలో చర్చిద్దామన్నారు. పూర్తి సమాచారంతో అందరూ మాట్లాడాలని సూచించారు. రెవిన్యూ చట్టంతో రాష్ట్ర రూపురేఖలు మారతాయని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ఎల్పీ సమావేశం సందర్భంగా దుబ్బాక దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికి సీఎం కెసిఆర్ ఘనంగా నివాళి అర్పించారు. ఆయన మృతితో దుబ్బాకలో ఉప ఎన్నికల అనివార్యమైన విషయం తెలిసిందే. పార్టీ అభ్యర్థి ఎంపికపై కొంత ఉత్కంఠ ఉన్నా.. సోలిపేట కుటుంబంలోనే ఒకరికి టికెట్ కేటాయించే అవకాశం ఉన్నట్లు టీఆర్ఎస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇకపోతే టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలపై నేతలతో మాట్లాడుతూ కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం సర్వేలు జరిపించినట్లు తెలిపారు. సర్వేలన్నీ కూడా టీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని వెల్లడించారు.

94-104 సీట్లు టీఆర్ఎస్ గెలుచుకుంటుందని ప్రకటించారు. ఇక గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ భవిష్యత్ ఎలా ఉండబోతుందో కూడా కేసీఆర్ తేల్చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ వీక్‌గా ఉందని చెప్పుకొచ్చారు. హస్తంపార్టీ రోజురోజుకు బలహీన పడుతోందని వివరించారు. బీజేపీపై మాత్రం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీకి ఇప్పుడున్న సీట్లకన్నా ఒకటి, రెండు సీట్లు పెరగొచ్చని జోస్యం చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో మాత్రం సభ్యులంతా హుందాగా ఉండాలని కేసీఆర్ సూచించారు. గత గ్రేటర్ ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ ఊహించని స్థాయిలో సీట్లు వచ్చాయి. దాదాపు 99 సీట్లు టీఆర్ఎస్సే కైవసం చేసుకుంది. ఈసారి కూడా అదే ధీమాను సీఎం కేసీఆర్ వ్యక్తం చేశారు. కరోనా సమయంలో జీహెచ్ఎంసీలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ ఇప్పటికే శ్రీకారం చుట్టారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి నియోజకవర్గం మల్కాజ్‌గిరిలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని సన్నాహాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కీలకమైన అంశాలపై చర్చించేందుకు తెలంగాణ మంత్రివమండలి సమావేశమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షత సమావేశమైన కేబినెట్ కొత్త రెవెన్యూ చట్టం, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించనుంది. సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా సీఎం సభ్యులతో చర్చించినట్లు సమాచార

# స్త్రీల ఐక్యత విజయానికి నాంది..!!



సంగారెడ్డి సెప్టెంబర్ 9 (నేటినిజం ప్రతినిధి) మహిళలు సంఘటితంగా చేసిన ఏ పనైనా విజయవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.

మంగళవారం సంగారెడ్డి మండలం తాళ్ళపల్లి గ్రామంలో గ్రామ మహిళా సంఘం సమావేశానికి కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారన్నారు. తడి - పొడి చెత్త వేరు చేయడం ,పోషణ అభియాన్ లో భాగంగా ఇంటింటా పోషణ సంబరాలు ఏ విదంగా నిర్వహి స్తున్నారు, ఎవరెవరు పాల్గొంటున్నారు అన్న విషయాలను సమావేశంలో ఆరా తీశారు. తడి పొడి చెత్తను వేరు చేయడంలో గ్రామంలో మహిళ లందరిని చైతన్య పరుస్తూ అవగాహన కల్పించి , తడి పొడి చెత్తను వేరు వేరుగా ఇచ్చేలా చూస్తున్నామని వారు కలెక్టర్ కు తెలిపారు.

పోషణ అభియాన్ కార్యక్రమం ప్రస్తుత పరిస్తితులలో మహిళలకు ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమని , అందరు తల్లులకు అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. ముఖ్యంగా గర్భవతులు,బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాల లోపం లేకుండా వారికి తగు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**

సంబంధిత శాఖాల వారు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంబంధిత రిజిస్ట ర్ లను కలెక్టర్ తనిఖి చేశారు.

పోషణ అభియాన్ లో బాగంగా నిర్వహించిన (1.చిన్న పిల్లలు , బాలికలు, మహిళలను పోషణ లోపం నుంచి విముక్తి చేస్తూ ఆరోగ్యవంతులను చేస్తామని ప్రతిజ్ఞ . 2.సబ్బుతో చేతులు కడుక్కొనే విధానాలు 3.మూడు రంగుల ఆహారపు జెండా ) కార్యక్రమాల అవగాహన పై కలెక్టర్ పరిశీలించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామం లో పెద్ద ఎత్తున జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నరసింహ రావు , గ్రామ సర్పంచ్ ప్రవీణ్ , ఎంపీడీవో మహేందర్ రెడ్డి, డి పి ఎం. జయ శ్రీ, ఏ పీ ఎం వెంకట్, సీసీ సుదర్శన్ , పంచాయతి కార్యదర్శి మురలి కృష్ణ, వి ఓ అధ్యక్షురాలు మహేశ్వరి, సుమలత , అంగన్వాడి టీచర్లూ , మహిళా సంఘాల సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# పోడు రైతులను పట్టించుకోని కెసిఆర్: కోదండరామ్

భద్రాద్రి,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ):కేసీఆర్ సర్కార్‌పై నిరుద్యోగులు ఆగ్రహంతో ఉన్నారని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నారని ఆరోపించారు.

నిరుద్యోగుల జీవి తాలతో కేసీఆర్ ఆడుకుంటున్నారని ధ్వజ మెత్తారు. ప్రైవేట్ టీచర్లను ప్రభుత్వం ఆదుకో వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పోడు రైతుల పట్ల ప్రభుత్వ వైఖరి దుర్మార్గంగా ఉందని మండిపడ్డారు. ఎన్నికల ముందు పోడు రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి. .కేసీఆర్ సర్కార్ మాట తప్పిందని కోదం డరాం విమర్శించారు. ఇంతకాలంగా పోడు రైతులు కోరుతున్నా వారి భూములకు పట్టాలు ఇవ్వకుండా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

# గంజాయి సాగును ధ్వంసం చేసిన పోలీసులు

సంగారెడ్డి,సెప్టెంబర్8(నేటినిజం ప్రతినిధి): అంతరపంటగా నిషేధిత గంజాయి మొక్కలను సాగు చేస్తుండటంతో పోలీసులు ధ్వంసం చేశారు.

జిల్లాలోని జహీరాబాద్ మండలంలోని హుగెల్లి గ్రామ శివారులో ఇద్దరు రైతులు అక్రమంగా అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో.. దాడులు చేసి ధ్వంసం చేశామని జహీరాబాద్ పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో అక్రమంగా 300 మొక్కలు పెంచినట్లు ఆయన తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు రైతులు పరారీలో ఉన్నారన్నారు. ఎవరైనా గంజాయిని సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పివి దయవల్లనే ఇంజనీరింగ్ చదివా

### పైసా ఖర్చు లేకుండా సీటుకి రిమండ్ చేశారు
### అసెంబ్లీలో గతాన్ని గుర్తు చేసుకున్న మంత్రి గంగుల
### వరంగల్ బిడ్డగా గర్విస్తున్నానన్న మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దయవల్లనే తాను ఇంజనీరింగ్ సీటు సంపాదించానని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆయన కారణంగానే బిసినైన తనకు రూపాయి ఖర్చులేకుండా చదువుకునే అవకాశం వచ్చిందన్నారు. పివికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మంత్రి గంగుల కమలాకర్ బలపరిచారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. పీవీతో తనకు చాలా అనుబంధం ఉంది. తాను ఇంజనీరింగ్ చదివేటప్పుడు 1984లో ఆయన ఎంపీగా ఉన్నారు. తనకు ఇంజనీరింగ్ సీటు ఇవ్వాలని ఓ ఇంజనీరింగ్ కాలేజీకి పీవీ ఓ చిటీ మీద రాసిచ్చారు. అయితే డబ్బులు కట్టాలని కాలేజీ వారు చెప్పడంతో మళ్లీ పీవీ వద్దకు వెళ్లాము. ఆ సందర్భంలో పీవీ ఓ మాట అన్నారు. వెనుకబడిన కులాల బిడ్డలు డబ్బులు కట్టలేరు అని పీవీ అన్నారని మంత్రి గుర్తు చేశారు. ఒక్క రూపాయి కూడా డబ్బు లేకుండా సీటు ఇప్పించారు. అలా పీవీ వల్ల తన ఇంజినీరింగ్ విద్య పూర్తయింది. పీవీ ప్రధాని అయ్యాక ఆయనను కలిశాను. తెలంగాణ బిడ్డ అయిన పీవీకి గౌరవం దక్కాలనే ఉద్దేశంతో శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ పరిణామం సంతోషించదగ్గ విషయమని మంత్రి అన్నారు. సాగునీటి రంగంలో పీవీ కన్న కలలను సీఎం కేసీఆర్ నిజం చేస్తున్నారు. కరీంనగర్ - వరంగల్ రహదారికి పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సీఎం కేసీఆర్‌కు మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ, దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్నఇవ్వాలని.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి పీవీ అన్నారు. పీవీ వరంగల్ ఉమ్మడి జిల్లాలో పుట్టిన బిడ్డగా మేమంతా గర్వంగా ఈరోజు వారి గురించి మాట్లాడటం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేశాన్ని సమర్థవంతంగా పాలించి గొప్ప పేరు తెచ్చుకున్నారని పీవీ సేవలను కొనియాడారు. ఈరోజు అనేకమంది దళిత, గిరిజన బిడ్డలు గురుకులాల్లో చదువుకొని ఉన్నతమైన అవకాశాలు పొందుతున్నారు. అందుకు కారణం ఆరోజు పీవీ నవోదయ పాఠశాలలు, గురుకులాలకు పునాది వేయడమేనన్నారు. ఇంతటి విశిష్ట వ్యక్తికి భారతరత్న ఇవ్వాలని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

పివి సంస్కరణలు దేశానికి వన్నె తెచ్చాయి: శ్రీనివాసగౌడ్‌తెలంగాణ గడ్డ మీద పుట్టిన పీవీ నరసింహారావు ఏ అన్యాయాన్ని సహించలేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బలపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్వారీ నుంచి ప్రధాని వరకు పీవీ అనేక సంస్కరణలు తెచ్చి దేశానికే వన్నె తెచ్చారు. అలాంటి తెలంగాణ ముద్దుబిడ్డకు దేశంలో సరైన గౌరవం దక్కలేదు. ఈ క్రమంలో పీవీకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నది. అపారమైన జ్ఞానంతో అనేక సంస్కరణలు తెచ్చి దేశంలో ఓ గొప్పగా వ్యక్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా పీవీ శతజయంతి ఉత్సవాలు నిరాడంబరంగా జరుగుతున్నాయి. పీవీ పుట్టిన, పెరిగిన ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్ద బోతున్నామని తెలిపారు. పట్వారీగా ఉన్న సమయంలోనే 830 ఎకరాలను పేదలకు పంచిపెట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణలో పీవీకి గుర్తింపు రావడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

# అంధత్వంలేని సమాజం కోసం కృషి

### -నేత్రదానం చేసిన సిఎం పళనిస్వామి

చెన్నై,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): అంధత్వం లేని సమాజం నిర్మాణానికి కళ్లు దానం చేయాలని, ఇందుకు రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి తిరు ఎడప్పాడి కే పళనిస్వామి పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. జాతీయ నేత్రదానం ఫోర్ట్‌నైట్ సందర్భంగా సిఎం పళనిస్వామి తన నేత్రాలను దానం చేశారు. అనంతరం నేత్రదానం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోర్టల్‌ను సైతం ప్రారంభించారు. పళనిస్వామికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, తమిళనాడు రాష్ట్ర అంధత్వ నియంత్రణ సంఘం, రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌వీ చంద్రకుమార్ సర్టిఫికెట్ అందజేశారు. పళనిస్వామి గర్వించదగిన కంటి దాత అని, తన నేత్రాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా తన దేశాన్ని అంధత్వరహితంగా చేస్తానని ప్రతిజ్ఞ చేసినట్లు ఆ సర్టిఫికేట్ పేర్కొంది. దేశంలో ప్రతి ఏడాది ఆగస్ట్ నుంచి సెప్టెంబర్ మధ్య నేషనల్ ఐ డొనేషన్‌ను ఫోర్ట్‌నైట్‌గా పాటిస్తారు.

# అంబులెన్సులను ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ పేరుతో ప్రభుత్వానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంబులెన్స్‌లను అందజేస్తున్న విషయం తెలిసిందే. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఇవాళ 9 అంబులెన్స్‌లను మంత్రి కేటీఆర్ ప్రగతి భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లను కొవిడ్ సహాయక చర్యలకు ప్రభుత్వానికి అందజేసిన మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకుడు వేమిరెడ్డి నరసింహారెడ్డికి కేటీఆర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.